ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 26.0
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 24 మే 2025




అయ్యో పాపం..!

● నిర్లక్ష్యం.. క్షణికావేశానికి పసివారి బలి ● రైల్వే స్టేషన్‌లో పెచ్చులూడిపడి ఒకరు.. ● చీరల్లో చుట్టి.. తల్లి నిప్పుపెట్టడంతో ఇంకొకరు..

● ఏ పాపమూ ఎరుగని చిన్నారులు..! పండంటి పసివారు..! వ్యవస్థ నిర్లక్ష్యానికి ఒకరు.. కన్నతల్లి క్షణికావేశానికి ఒకరు బలి అయ్యారు. వేసవి సెలవుల్లో పుణ్యక్షేత్రాల సందర్శనకు అమ్మానాన్న, బంధువులతో కలిసి సంబరంగా బయలుదేరాడు ఏడేళ్ల మణికంఠ. కర్నూలు నుంచి గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు రాత్రికే చేరుకున్నారు. ఉదయాన్నే రైలు ఎక్కుతాడు..! ఎంత సంబరమో..! కలలుగంటూ ప్లాట్‌ఫాంపై పడుకున్నాడు. మరో రెండు గంటలు గడిస్తే.. రైలు ఎక్కి రామేశ్వరానికి బయలుదేరేవాడు. కానీ శిథిలావస్థలో ఉన్న పైకప్పు పెచ్చులు ఊడి పసివాడి తలపై పడింది. రక్తం ధారలు కట్టింది. అమ్మానాన్న కంగారుగా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయినా ప్రయోజనం లేకపోయింది.!

● చరణ్ వయసు తొమ్మిది నెలలు మాత్రమే..! ఎప్పుడూ అమ్మ ఒడి, అప్పుడప్పుడు నాన్న భుజం తప్ప లోకం తెలియని బుజ్జిగాడు..! పుట్టుకతో అనారోగ్యం. నాన్న సరిగా పట్టించుకోలేదని అమ్మకు కోపం. ఎప్పుడూ ఇద్దరి మధ్య ఇదే గొడవ. అమ్మకు కోపం వచ్చింది. బుజ్జిగాడితో కలిసి లోకం విడిచి వెళ్లిపోవాలని అనుకుంది. తన చీరల మధ్యలో పసివాడిని చుట్టి నిప్పు పెట్టింది. ఇంకో చీరతో ఉరివేసుకోబోయింది. ఇంతలో ఇరుగూ పొరుగు పరుగున వచ్చి అడ్డుకున్నారు. తాను బతికిపోయింది. అప్పటికే మంటల్లో కాలిపోతున్న కొడుకును కాపాడుకునేందుకు విశ్వప్రయత్నం చేసింది. చీరల ఉండలో చిక్కుకున్న పసివాడిని ఎత్తుకుని.. పరుగున వెళ్లి మురుగునీటి కాలువలో పొర్లింది. మంటలు ఆరిపోయాయి.. వాటితోపాటు బుజ్జిగాడి జీవితం కూడా..!




● శిథిలావస్థలో ఉన్న రైల్వే స్టేషన్‌ను ఆ శాఖ అధికారులు బాగుచేసి ఉంటే మణికంఠ ఈ పాటికి అమ్మానాన్నతో కలిసి రామేశ్వరుడిని దర్శించుకునేవాడు. అంతకంటే ముందు మూడు సముద్రాల నీటిలో ఆడుకునేవాడు..! నాన్న బాధ్యతగా వ్యవహరించినా, అమ్మ క్షణికావేశానికి లోనుకాకపోయినా.. చరణ్ బతికే ఉండేవాడు. ఎప్పటిలాగే అమ్మ జోలపాట వింటూ ఉండేవాడు..! ప్చ్..!

(వివరాలు మెయిన్, 7లో)

మళ్లీ కరోనా..!



సర్వజన ఆస్పత్రిలో అప్రమత్తం

నోడల్ ఆఫీసర్‌గా డాక్టర్ రామస్వామి

అనంతపురం టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): కరోనా మళ్లీ కలవరపెడుతోంది. రాష్ట్రంలో కరోనా కేసులు నమోదవడంతో జిల్లాలో అప్రమత్తమయ్యారు. జిల్లా సర్వజనాస్పత్రిలో కరోనా కేసులు వస్తే ఎలా అనేదానిపై సూపరింటెండెంట్, ఇతర డాక్టర్లు సమావేశమై చర్చించారు. కొవిడ్ నోడల్ ఆఫీసర్‌గా పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ రామస్వామిని నియమించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఇంకా రాష్ట్రస్థాయి అధికారుల నుంచి మార్గదర్శకాలు రాలేదన్నారు. అక్కడి నుంచి వస్తే ఆ మేరకు తగిన ఏర్పాట్లు చేపడతామన్నారు. వైద్యులు మాత్రం కరోనా పెద్ద ప్రమాదం కాదనీ, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. కొవిడ్ జాగ్రత్తగా పాటిస్తే సరిపోతుందంటున్నారు.

హిందీ భాష అమలుకు కృషి: డీఆర్ఎం



అధికార భాషా సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, మే 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా కార్యాలయాలలో అధికారిక హిందీ భాషను అమలుపరచడానికి కృషిచేయాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయంలో నగర అధికార భాషా అమలు కమిటీ అర్ధ సంవత్సర సమావేశాన్ని శుక్రవారం ఉదయం నిర్వహించారు. సదస్సులో డీఆర్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాల యాల్లో హిందీ భాష అమలయ్యేలా వివిధ రైల్వే శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. హోం మంత్రిత్వ శాఖ లక్ష్యాలకు అనుగుణంగా హిందీ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, అధికార భాషా అమలు కమిటీ సభ్యులు, రైల్వే శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు వెంటనే అనుమతులు

కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, మే23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తే అనుమతుల జారీలో అలసత్వం వహించరాదనీ, వెంటనే ఇవ్వాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం సంబంధిత శాఖలు, బ్యాంకుల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్ఠం చేయాలన్నారు. ఔత్సాహికులను ఆహ్వానించి, పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. జిల్లాలో ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీలో 21 యూనిట్లకుగాను రూ62.86 లక్షల సబ్సిడీ మంజూరుకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. సింగిల్‌విండో పోర్టల్‌లో పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకున్న వెంటనే ఆమోదం తెలపాలన్నారు. మంజూరైన యూనిట్లకు బ్యాంకర్లు జాప్యం లేకుండా రుణాలు మంజూరుచేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లాపరిశ్రల అధికారి శ్రీనివాసయాదవ్, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, సేల్‌టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారెడ్డి, సాంఘిక సంక్షేమ డీడీ రాధిక, డ్రగ్స్ ఏడీ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోండి

పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన చర్యలను పక్కాగా చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేసే లక్ష్యంతో ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, అటవీ శాఖాధికారి శ్రీనివాసులు, డీఎల్పీఓ విజయ్‌కుమార్, రీసోర్స్‌పర్సన్ మాధవి, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

హమ్మయ్యా..!

● రోగుల సహాయకులకు విశ్రాంతి భవనాలు
● సర్వజన వైద్యశాలలో నేడు పనుల ప్రారంభం

అనంతపురం టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): సర్వజనాస్పత్రిలో రోగుల సహాయకులకు ఎంతో ఉపశమనం కలిగించే విషయం. వారు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా ప్రత్యేక భవనాలు ఏర్పాటు చేయనున్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తన నిధుల నుంచి రూ.75 లక్షలు కేటాయించారు. ఆ నిధులతో విశ్రాంతి భవనాల నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. శనివారం ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కలెక్టర్ వినోద్‌కుమార్.. భవన నిర్మాణ పనులను ప్రారంభించనున్నారని సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. దీంతో రోగుల సహాయకుల కష్టాలు తీరనున్నాయి.

రేపు ప్రభుత్వోద్యోగుల సంఘం ఎన్నికలు

అనంతపురం సెంట్రల్, మే 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) అనంతపురం జిల్లా ఎన్నికలను ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సంఘం జిల్లా కార్యాలయంలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల అధికారిగా రాఘురాంనాయుడు, పరిశీలకుడిగా సుదర్శన్‌రెడ్డిని నియమించారని ఆయన తెలిపారు.



కళ్యాణదుర్గం మండలం భట్టువానిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైరును ఎత్తుకెళ్లిన దృశ్యం (ఫైల్)



తన పొలంలో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లినట్లు చూపిస్తున్న బాధిత రైతు ఈడిగ పవన్ (ఫైల్)

తోటల్లోకి కాపలాగా వెళ్తున్నాం



దొంగల తాకిడి పెరగడంతో రాత్రిపూట ట్రాన్స్‌ఫార్మర్లకు కాపలాగా వెళ్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తే, కొత్తది తెచ్చి పెట్టుకోవడం గగనమవుతోంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు కాపలాగా వెళ్తున్నాం. పోలీసులు.. కాపర్ చోరీలకు అడ్డువేయాలి.

-రామాంజి, రైతు, మేళ్లకుంట

రెచ్చిపోతున్న కాపర్ దొంగలు..!

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి వైరు చోరీ

● వరుస ఘటనలతో రైతుల ఆందోళన ● కాపలాగా వెళ్లాల్సిన దుస్థితి ● విద్యుత్ శాఖకు రూ.కోట్లలో నష్టం

కళ్యాణదుర్గం, మే 23(ఆంధ్రజ్యోతి): దొంగలు కొత్త పంథాను ఎంచుకున్నారు. పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లపై గురిపెట్టారు. నియోజకవర్గ వ్యాప్తంగా పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, కాపర్ వైరు ఎత్తుకెళ్తున్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ శాఖకు రూ.కోట్లలో నష్టం వాటిల్లుతోంది. అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. ట్రాన్స్‌ఫార్మర్లకు కాపలాగా వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు. గతంలో డ్రిప్పులు, స్ప్రింక్లర్లు, వాటి సామగ్రిని చోరీ చేసేవారు. ఇప్పుడు ఏకంగా ట్రాన్స్‌ఫార్మర్లనే ధ్వంసం చేసి, అందులోని కాపర్ వైరును ఎత్తుకెళ్తున్నారు. వరుస చోరీలు జరుగుతున్నా.. అడ్డుకట్ట వేయడంలో పోలీసులు విఫలమవుతున్నారని రైతులు విమర్శిస్తున్నారు.

మార్కెట్‌లో డిమాండ్

కొన్నినెలల క్రితం వరకు డ్రిప్పులు, స్ప్రింక్లర్లను దొంగలు ఎత్తుకెళ్లేవారు. ఇటీవలిగా ట్రాన్స్‌ఫార్మర్లలోని ఖరీదైన కాపర్ వైరుపై కన్నేశారు. పొలంలో సుమారు 15 అడుగుల ఎత్తు వరకు రాతి కట్టడాన్ని ఏర్పాటుచేసి, వాటి మీద ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తారు. అలాంటి ట్రాన్స్‌ఫార్మర్‌నే సులువుగా ధ్వంసం చేసి, అందులోని కాపర్ వైరును ఎత్తుకెళ్తున్నారు. వేలాది రూపాయలు ఖర్చుచేసి, అతి కష్టమ్మీద రైతులు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకుంటే, వాటినే దొంగలు టార్గెట్ చేస్తూ ధ్వంసం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో కాపర్ వైరు విలువ రూ.900 నుంచి రూ.1000 వరకు ధర పలుకుతోంది. ఇదే అదునుగా చోరీలకు పాల్పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ తయారు కావాలంటే కెపాసిటీని బట్టి రూ.30 వేల నుంచి రూ.45వేల వరకు ఖర్చవుతుంది. అదే ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులకొట్టి అందులోని కాపర్ వైరును ఎత్తుకెళ్తే రూ.12 వేల నుంచి రూ.15 వేలు మాత్రమే వస్తుందని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తుండడంతో విద్యుత్‌శాఖకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లుతోంది. ఇప్పటికైనా పోలీసులు.. కాపర్ దొంగల ఆట కట్టించాలని రైతులు కోరుతున్నారు.

చోరీలు ఇవీ..

● ఏప్రిల్ 30న కళ్యాణదుర్గం మండలంలోని కామక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో సబ్ మెర్సిబుల్ మోటారును దుండగులు ఎత్తుకెళ్లారు.
● ఏప్రిల్‌లోనే కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి సమీపంలోని ఓ తోటలోగల ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, కాపర్ వైరును అపహరించారు.
● కళ్యాణదుర్గం మండలం యర్రంపల్లికి చెందిన ఓ రైతు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి, లోపల ఉన్న కాపర్ వైరును చోరీ చేశారు.
● దురదకుంట, భట్టువానిపల్లి గ్రామాల పరిధిలో రెండుచోట్ల దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, కాపర్ వైరు ఎత్తుకెళ్లారు.
● కంబదూరు మండలంలోని కుర్లపల్లిలో 24 గంటలు సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు పగులకొట్టి అందులోని కాపర్ వైరు అపహరించారు. గ్రామ పరిసరాల్లోనే ఉన్న ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేయడం గమనార్హం.
● కంబదూరు మండలం ఓబయ్యతోట సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, వైరును అపహరించారు. ఈ మధ్య కాలంలోనే అండేపల్లిలో కూడా ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. అందులోని కాపర్ వైరును ఎత్తుకెళ్లారు.



ఆర్థికంగా నష్టపోతాం



వేలాది రూపాయలు ఖర్చు చేసి పొలాల్లో ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తే ఆర్థికంగా నష్టపోతాం. ట్రాన్స్‌ఫార్మర్‌ను కాపాడుకునేందుకు రోజూ రాత్రిపూట తోటకు కాపలాగా వెళ్తున్నాం. కాపర్ వైరు చోరీలు ఆందోళన కలిగిస్తున్నాయి.

-రవి, రైతు, ఒంటారెడ్డిపల్లి

పూర్తిస్థాయిలో నిఘా పెట్టాం



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరును అపహరించే దొంగలపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టాం. ఆయా గ్రామాల ప్రజలు సమాచారం అందిస్తే పూర్తిస్థాయిలో వీటిని అరికట్టేందుకు కృషి చేస్తాం.

-రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

సీమ సీఎంలే ఉన్నా.. తీవ్ర అన్యాయం

రాయలసీమ సమస్యలపై మహానాడులో తీర్మానం చేయాలి

డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి

ఉరవకొండ, మే 23(ఆంధ్రజ్యోతి): రాయలసీమకు చెందినవారే రాష్ట్ర ముఖ్యమంత్రులుగా కొనసాగుతున్నా ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేశారని కాంగ్రెస్ పార్టీ జిల్లా (డీసీసీ) అధ్యక్షుడు మధుసూధన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ వసతి గృహంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాయలసీమ సమస్యలపై మహానాడులో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. గాలేరి-నగరిని హంద్రీనీవాతో అనుసంధానం చేయాలన్నారు. రాయలసీమలోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలన్నారు. హంద్రీనీవా కాలువను 10వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని కోరారు. ఫేజ్-2లో లైనింగ్ పనులు ఆపాలన్నారు. లైనింగ్ వల్ల జిల్లా రైతాంగానికి తీవ్ర అన్యాయం వాటిల్లుతుందన్నారు. 6.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాలన్నారు. తుంగభద్ర ఎగువ కాలువ ఆధునికీకరణ పూర్తి చేసి, సమాంతరంగా మరో కాలువ తవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను నియోజకవర్గ ప్రజలు ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారనీ, కాలువల డిస్ట్రిబ్యూటరీల పనులు పూర్తి చేసి, ఆయకట్టుకు నీరు ఇచ్చేలా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శీనా, బ్యాళ్ల ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

అర్జీలకు పరిష్కారమేదీ?

డీఈఓను నిలదీసిన ఉపాధ్యాయ సంఘాల నేతల

కో-ఆర్డినేషన్ మీటింగ్ పెట్టాలని డిమాండ్

అనంతపురం విద్య, మే 23(ఆంధ్రజ్యోతి): బదిలీలు, ఉద్యోగోన్నతుల అర్జీలకు పరిష్కారం చూపడం లేదని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుంటే ఎలాగని డీఈఓ ప్రసాద్ బాబును నిలదీశారు. పలు సంఘాల నేతలు శారదా స్కూల్‌లో డీఈఓ ప్రసాద్‌బాబును శుక్రవారం రాత్రి 7.30 గంటలకు కలిశారు. బదిలీలు, ప్రమోషన్ల వేళ సర్వీస్, స్టేషన్ పాయింట్లు, ఇతర సమస్యలపై టీచర్లు, సంఘాల నేతలు అర్జీలు ఇస్తున్నారని, వాటికి జవాబు మాత్రం ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఖాళీలు, మిగులు టీచర్ల వివరాలు, సీనియారిటీ జాబితాలపై టీచర్లకు ఏమాత్రం సమాచారం లేదని అన్నారు. కమిషనర్ నుంచి వచ్చే వెబెక్స్ సమాచారం కూడా తమకు సక్రమంగా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఉపాధ్యాయ సంఘాల నేతలతో కో-ఆర్డినేషన్ మీటింగ్ పెట్టాలని, సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. కో-ఆర్డినేషన్ మీటింగ్ పెడతామని డీఈఓ హామీ ఇవ్వడంతో సంఘాల నాయకులు వెనుదిరిగారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నేతలు రమణారెడ్డి, రామాంజనేయులు, సూర్యుడు, శ్రీనివాసులు నాయక్, శ్రీనివాసరెడ్డి, వెంకటసుబ్బయ్య, సిరాజుద్దీన్, వెంకటరత్నం, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కులశేఖర్ రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.



డీఈఓను నిలదీస్తున్న సంఘాల నేతలు

జింకను బతికించుకోవాలని..!

● రైతుల తీవ్ర ప్రయత్నం ● కుక్కల దాడి నుంచి కాపాడి పశువైద్యశాలకు తరలింపు ● చికిత్స పొందుతూ మృతి



గాయాలతో కదలలేని స్థితిలో ఉన్న జింక, కుక్కలను తరిమి జింకను కాపాడే ప్రయత్నం చేస్తున్న రైతులు



యాడికి, మే 23(ఆంధ్రజ్యోతి): కుక్కలదాడిలో తీవ్రంగా గాయపడిన జింకను కాపాడి పశువైద్యశాలకు తరలించారు స్థానికులు. అక్కడ చికిత్స పొందుతూ జింక మృతిచెందింది. శుక్రవారం ఉదయం యాడికి గ్రామ సమీపాన పొలం వద్దకు జింక వచ్చింది. అక్కడ ఉన్న కుక్కలు జింక వెంటపడి తీవ్రంగా గాయపరిచాయి. దీనిని గమనించిన సమీప రైతులు చంద్రశేఖర్ రెడ్డి, బాలకృష్ణ.. కుక్కల దాడి నుంచి జింకను రక్షించారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారువచ్చేలోగా జింకను కాపాడుదామని యాడికి పశువైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స అందిస్తున్న సమయంలో జింక మృతిచెందింది. జింకను కాపాడాలని రైతులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలకృష్ణ ఎంతో ప్రయత్నించారు. అయినా జింక ప్రాణాలు కాపాడలేకపోయామని వారు ఆవేదన చెందారు. పశువైద్యశాల వద్దకు వచ్చిన ఫారెస్ట్ అధికారి జింక కళేబరాన్ని తీసుకెళ్లి ఖననం చేశారు. అటవీ ప్రాంతాల్లో వన్యమృగాలకు ఆహారం, నీరు దొరక్క జనావాసాల్లోకి వస్తున్నాయనీ, ఆ సమయంలో కుక్కల బారినపడి చనిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వన్యమృగాలు తిరిగే ప్రాంతాల్లో వాటి దాహం తీర్చేలా కనీసం నీటిని ఏర్పాటుచేసే దిశగా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చీనీ టన్ను రూ.38 వేలు



అనంతపురం రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 38,120 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 5,100, సరాసరి రూ.22వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 693 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

జడ్పీ సీఈఓపై బదిలీ వేటు

● ప్రభుత్వం వద్ద రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశాలు
● డిప్యూటీ సీఈఓకు ఎఫ్ఏసీ బాధ్యతలు

7

పైపై మెరుగులు..?

● ఎయిర్‌పోర్టులా కనిపిస్తున్న రైల్వేస్టేషన్
● గుంతకల్లు స్టేషన్ లోపలంతా డొల్లే

పిట్ట కథ..!


ఆకలైతాందీ.. అమ్మా నాయిన ఎప్పుడొస్తారో ఏమో..!


ఏమీ దొరకలేదు బుజ్జీ.. అట్లా అలిగితే ఎట్లా..?


పసిదానికి ఆకలైతాందంట.. ఏమైనా తెచ్చేదుందా.. లేదా..?


బుద్ధి లేక పెండ్లి చేసుకుండా..! పోతాండా ఉండు..!


ఇదిగో తెచ్చినా.. తిను..!


అంతేలే.. మీరు మీరు పాముకోండి..!


నిన్ని ఇడిసిపెట్టి ఎట్ల తింటా చెప్పు బుజ్జీ..? ఇది నీకే..

(బుక్కరాయసముద్రం చెరువులో..)

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

బదిలీలపై ఉత్కంఠ!

- అనుకూల ప్లేస్‌ల కోసం ఉద్యోగుల యత్నాలు
- ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు
- ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు
- అయినా.. దక్కుతుందో లేదోనన్న సందేహాలు



అనంతపురం టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీలకు పచ్చజెండా ఊపింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక కొన్ని బదిలీలు జరిగినా అపుడు వివిధ మార్గదర్శకాలు అమలు చేయడంతో అనుకున్నవారు రాలేకపోయారు. ఎవరనీ కదపలేకపోయారు కూడా. దీంతో వైసీపీ హయాంలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులే చాలా శాఖల్లో ఉంటూ హవా సాగిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏ పనిచెప్పినా చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. ఇదే విషయంపై ప్రజాప్రతినిధుల వద్ద టీడీపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇపుడు మొత్తం అన్నిశాఖల బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇప్పుడైనా తమకు అనుకూలమైన వారిని నియమించుకోవాలని ప్రజాప్రతినిధులు, టీడీపీ శ్రేణులు ఆరాట పడుతున్నాయి. అధికారులు, ఉద్యోగులు సైతం తమకు అనుకూలమైన ప్లేస్‌లకు వెళ్లేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ కొన సాగుతున్నా. ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, జడ్పీ, ఎంపీడీఓలు, వివిధ శాఖల ఇంజనీర్లు తీవ్రప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. దీంతో ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు తీసుకుని, ఉన్నతాధికారులకు అందజేస్తున్నారు.

ఉమ్మడి జిల్లావారీగా రెవెన్యూ బదిలీలు

కీలకమైన శాఖ రెవెన్యూ. దీంతో ప్రజాప్రతినిధులు కూడా ఈ శాఖలో తమకు అనుకూలంగా ఉండేవారినే నియమించుకుంటారు. ఎంపీడీఓల నియామకంపైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ఈ బదిలీలు ఉమ్మడి జిల్లావారీగా చేపట్టనున్నారు. రెవెన్యూశాఖ బదిలీలే హాట్‌టాపిక్‌గా మారాయి. ఆ బదిలీలకు ఉమ్మడి అనంత జిల్లా కలెక్టరే చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కింది స్థాయి కేడర్ల బదిలీలు జాయింట్ కలెక్టర్, డీఆర్వో ఆధ్వర్యంలో చేపడతారు. ఆ మేరకు బదిలీలు చేయడానికి యంత్రాంగం కసరత్తు మొదలెట్టింది.

ఆశావహుల్లో ఉత్కంఠ

బదిలీలపై పెద్దఎత్తున పైరవీలు చేయించుకుంటుంటే కలెక్టర్ వినోద్‌కుమార్ మాత్రం నిబంధనల మేరకే చేస్తామని చెబుతున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక కొన్నిశాఖల్లో బదిలీలు జరిగినపుడు కూడా జిల్లాలో నేతలు ప్రతిపాదించిన వారికి పోస్టింగ్స్ ఇవ్వలేదు. అప్పట్లో దీనిపై ప్రజాప్రతినిధుల నుంచి కూడా అసంతృప్తి వ్యక్తమైంది. అప్పటికప్పుడు కొందరి పోస్టింగ్‌లను మార్చి ఇచ్చారు. ఇపుడు మళ్లీ కలెక్టర్, జేసీ నిబంధనలు అంటూ సిఫార్సు లేఖలను పక్కనపెడతారేమోనన్న ఉత్కంఠ ఆశావహుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో తాము కోరుకున్న స్థానాన్ని దక్కించుకునేందుకు అధికార పార్టీ నేతల నుంచి ఉన్నతాధికారులపై ఒత్తిడి పెట్టిస్తున్నారు. ఏం జరుగుతుందో చూడాలి మరి.

ఉద్యోగం వదిలి సేద్యపు బాట


గోపాల్‌రెడ్డి

- సేంద్రియ పద్ధతిలో అరటి సాగు
- లాభాలు గడిస్తున్న మంగాపురం రైతు


సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన బొప్పాయి

పెనుకొండ రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంపై మక్కువ ఉన్నా తీవ్ర కరువు నేపథ్యంలో సాగు నీరు లేక ఓ యువకుడు పొట్టకూటి కోసం వలస వెళ్లాడు. కాల ప్రవాహంలో రెండు దశాబ్దాలు గడిచిపోయాయి. జిల్లాకు హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు రావడం, గొలపల్లి రిజర్వాయర్ నిర్మాణంతో సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో యువకుడిగా వెళ్లిన ఆయన నడివయసులో స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. సేంద్రియ సేద్యం ప్రారంభించాడు. లాభాలు గడిస్తూ పలువురికి ఆదర్శంగా మారాడు. ఆయనే మండలంలోని మంగాపురం గ్రామానికి చెందిన రైతు గోపాల్‌రెడ్డి.

బెంగళూరు నుంచి వచ్చి..

గ్రామంలో కరువు పరిస్థితులు ఉండటంతో రెండు దశాబ్దాల కిందట గోపాల్‌రెడ్డి బెంగళూరుకు వలస వెళ్లాడు. అక్కడ మెడికల్ పీఆర్‌ఓగా పని చేసేవాడు. నెలకు రూ.30 వేలదాకా జీతం లభించేది. మనసు మాత్రం ఎప్పుడు ఊరిపైనే ఉండేది. ఈక్రమంలోనే జిల్లాలో పరిస్థితులు మారాయి. కృష్ణా జలాలతో చాలా ప్రాంతం సస్యశ్యామలం కాసాగింది. ఇది గమనించిన గోపాల్‌రెడ్డి రెండేళ్ల కిందట ఉద్యోగాన్ని వదిలి స్వగ్రామం చేరుకున్నాడు. తనకున్న 3.5ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో అరటి సాగు చేశాడు. దిగుబడులు బాగా రావడమే కాకుండా గిట్టుబాటు ధర లభించడంతో వ్యవసాయం లాభసాటిగా మారింది. అరటిలో అంతర పంటలుగా బొప్పాయి, మామిడి, డ్రాగన్‌ఫ్రూట్, మునగ, కంది, వక్క సాగుచేశాడు. ఒక్కో అరటి మొక్కను రూ.30చొప్పున కొనుగోలు చేసి 2వేల మొక్కలు నాటాడు. పంట సాగు, కూలీలు, ఎరువుల కోసం దాదాపు రూ.2.10లక్షలు ఖర్చుచేశాడు. పంట దిగుబడి బాగా వచ్చిందన్నారు. ఒక్కో గెల 8కిలోల నుంచి 12కిలోలు వచ్చిందన్నారు. ఇప్పటిదాకా పెట్టుబడి మొత్తం వచ్చిందన్నారు. ఇంకా రెండు మూడు కోతలు వస్తాయని, అదంతా అదనపు లాభమేనని ఆనందం వ్యక్తం చేశారు.

అరటిలో లాభాలు బాగున్నాయ్

గతంలో నేను బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో పీఆర్‌ఓగా పని చేసేవాడిని. రూ.30వేలు జీతం వచ్చేది. ఆ ఉద్యోగానికి స్వస్తి చెప్పి నాకున్న సొంత భూమిలో సేంద్రియ పద్ధతిలో అరటి, బొప్పాయి, వక్క ఇలా తొమ్మిది రకాల పంటలను సాగుచేశా. యాలక్కి రకం అరటి సాగులో నాలుగుసార్లు కోత కోయగా 5టన్నులు దిగుబడి వచ్చింది. కిలో రూ.40నుంచి రూ.50దాకా పలికింది. పెట్టుబడులు అన్నీ వచ్చేశాయి. ఇంకా మూడు కోతలు అవుతాయి. అదంతా లాభమే.

- గోపాల్‌రెడ్డి, రైతు


అమ్మకానికి సిద్ధంగా ఉంచిన అరటి గెలలు


స్వరూప్


సాయికుమార్


విరూపాక్షరెడ్డి


రాజు

గ్రేడ్-2 వీఆర్వోల జిల్లా కమిటీ ఎంపిక

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సాయికుమార్, విరూపాక్షరెడ్డి

అనంతపురం రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా కార్యవర్గం ఎంపిక జరిగింది. జిల్లా కేంద్రంలోని కృష్ణకళామందిరంలోని రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం అసోసియేషన్ జిల్లా అడహక్ కమిటీని ఎంపిక చేశారు. ఇదే సందర్భంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి స్వరూప్, జిల్లా అధ్యక్షులు సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా విరూపాక్షరెడ్డి కోశాధికారిగా రాజు, వైస్‌ప్రెసిడెంట్లుగా నరేష్‌కుమార్, కుమారస్వామి, రాఘవేంద్రరాజు, సహాయ కార్యదర్శులుగా అనిల్, అశోక్‌కుమార్, రఘుయాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పురుషోత్తం, లిఖిత, ఈసీ మెంబర్లుగా సయ్యద్, అఫ్రిది, వెంకట రాజేష్, దిల్షాద్, వీరేష్, ఆదినారాయణ, నీలకంఠరెడ్డిలను ఎంపిక చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి స్వరూప్ మాట్లాడుతూ జిల్లా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. జిల్లాలో త్వరితగతిన సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపడతామన్నారు. డివిజన్ కమిటీలు పూర్తి చేస్తామని వెల్లడించారు.

శ్రీనిధి మేనేజర్‌గా సాగర్

అనంతపురం క్లాక్‌టవర్, మే 23 (ఆంధ్రజ్యోతి): శ్రీనిధి మేనేజర్‌గా సాగర్ నియమితులయ్యారు. డీఆర్‌డీఏ-వెలుగులో శ్రీనిధి విభాగం అత్యంత కీలకం. స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు ఇవ్వడంలో శ్రీనిధి ముందుంటుంది. ఇదివరకు శ్రీనిధి మేనేజర్‌గా ఉన్న హనుమేష్‌ను శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు. కర్నూలులో శ్రీనిధి మేనేజర్‌గా ఉన్న సాగర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ శైలజను సాగర్ మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలు స్వీకరించారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త..

- లూజు విత్తనాలు సిద్ధం చేసుకున్న దళారులు
- రైతులకు అంటగట్టే ప్రయత్నాలు
- వాటిని కొంటే నష్టాలే..
- ధ్రువీకరించిన, ప్యాక్డ్ విత్తనాలే కొనాలంటున్న వ్యవసాయాధికారులు


వరి విత్తనాలు

బొమ్మనహాళ్, మే23(ఆంధ్రజ్యోతి): ముందస్తు వర్షాలు కురుస్తుండడంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కూడా ముందుగానే ప్రారంభమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మండలంలో రైతులు, వరి, మిరప, వేరుశనగ తదితర పంటల సాగుకు విత్తనాలు సిద్ధం చేసుకునే పనిలో ఉన్నారు. సాగులో కీలకమైన విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు వహించాల్సి ఉంది. లూజు విత్తనాలను అమ్మేందుకు దళారులు సిద్ధమవుతుండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లూజు విత్తనాలకు బదులు ప్యాకెట్‌లో ఉన్న వాటిని కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. గతంలో బొల్లనగుడ్డం, దర్గాహొన్నూరు గ్రామాల్లో పొద్దుతిరుగుడు, సజ్జ నకిలీ విత్తనాల కారణంగా పంటలు దెబ్బతిని, రైతులు తీవ్రంగా నష్టపోయారు. కర్నాటక నుంచి నకిలీ విత్తనాలను దిగుమతి చేసుకుని, ఇక్కడి రైతులకు అంటగడతారని తెలుస్తోంది. కర్నాటక, చెన్నై, ప్రాంతాల నుంచి పలు రకాల కంపెనీలకు చెందిన కవర్లను తీసుకొచ్చి, వాటిలో నింపి, రైతులకు విక్రయిస్తుంటారు. కొన్నేళ్లుగా వ్యవసాయ శాఖాధికారులు రవాణా మధ్యలోనే చర్యలు తీసుకుంటుండడంతో నకిలీ సమస్య కొంత తగ్గింది. కొందరు దళారులు మళ్లీ లూజు విత్తనాలు విక్రయించేందుకు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రైతులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లూజు విత్తనాలైతే..

ప్యాకెట్లలో కాకుండా విడిగా విత్తనాలను కొనుగోలు చేస్తే వాటిలో నాణ్యత ఉండదు. ఈ విత్తనాల తయారీలో కంపెనీకి చెందిన ధృవీకరణ అధికారుల ప్రమేయం ఉండదు. లూజు విక్రయాలు జరిపేవారు రైతులకు బిల్లు ఇవ్వరు. విత్తన శుద్ధి, ఇతర ప్రమాణాలు పాటించరు. ఆ విత్తనాలు సాగుచేసినపుడు పంట మధ్యలో పూత, కోత దశల్లో దెబ్బతింటే విక్రయించిన వారు బాధ్యత వహించారు. రైతులకు నష్టం తప్పదు.

గుర్తింపు పొందిన కంపెనీలవే కొనాలి

వ్యవసాయశాఖ గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలనే రైతులు కొనుగోలు చేయాలి. ఆ విత్తనాల తయారీలో వివిధ దశల్లో ధ్రువీకరణ అధికారులు ఉంటారు. విత్తన నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లు తప్పక ఇస్తారు. ఆ తరువాత రైతులకు నష్టం వాటిల్లితే పరిహారం వచ్చే ఆవకాశం ఉంటుంది. వ్యవసాయ శాఖ సిబ్బందితో అనుమతి పొందిన లైసెన్స్‌డ్ దుకాణల్లో విత్తనాలు కొనుగోలు చేయాలి. వ్యాపారి నుంచి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. పంటకాలం పూర్తయ్యేవరకు వాటిని జాగ్రత్తగా ఉంచుకోవాలి.

రైతులు జాగ్రత్తలు పాటించాలి



గ్రామీణ ప్రాంతాల్లో చాలావరకు కర్నాటకలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి లూజు విత్తనాలను తెచ్చుకుంటున్నారు. అలాంటి విత్తనాలను కొనుగోలు చేయరాదు. గ్రామాల్లోకి వచ్చి ఎవరైనా అక్రమంగా లూజు విత్తనాలు, వివిధ కంపెనీల విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. అలాంటి వారు గ్రామాలకు వస్తే సమాచారం ఇవ్వండి. విత్తన కొనుగోలులో జాగ్రత్తలు పాటిస్తే సాగుకు ముందే వాటిల్లే నష్టాన్ని రైతులు నివారించుకోవచ్చు.

-సాయికుమార్, ఏఓ, బొమ్మనహాళ్

విత్తన సబ్సిడీ ఖరారు



అనంతపురం అర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి పలురకాల విత్తనాలకు ప్రభుత్వం సబ్సిడీ ధరలు ఖరారు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు అందినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. మినుములు, పెసలు, కంది, నువ్వుల విత్తనాలకు 30 శాతం సబ్సిడీ, కొర్ర, రాగులకు 50 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. బీపీటీ-5204 రకం వరి క్వింటాల్ పూర్తి ధర రూ.4300లుగా నిర్ణయించారు. ఇందులో జాతీయ ఆహార భద్రత పథకం కింద రూ.1000 సబ్సిడీ, ఇతర రైతులకు రూ.500 సబ్సిడీ వర్తింపజేశారు. మినుములు పూర్తి ధర రూ.13800లుగా నిర్ణయించారు. ఇందులో రూ.4140లు సబ్సిడీపోను రైతు వాటా రూ.9660 చెల్లించాలి. పెసలు క్వింటాల్ పూర్తి ధర రూ.13500లుగా నిర్ణయించారు. ఇందులో సబ్సిడీ రూ.4050లుపోను రైతు వాటా రూ.9450లు చెల్లించాలి. కంది క్వింటాల్ పూర్తి ధర రూ.10950లుగా నిర్ణయించారు. ఇందులో రూ.3285లు సబ్సిడీపోను రైతు వాటా రూ.7665లు చెల్లించాలి. కొర్ర క్వింటా పూర్తి ధర రూ.6000లుగా నిర్ణయించారు. ఇందులో రూ.3000లు సబ్సిడీపోను రైతు వాటా రూ.3000లు చెల్లించాలి. రాగి క్వింటా పూర్తి ధర రూ.6900లుగా నిర్ణయించారు. ఇందులో సబ్సిడీ రూ.3450లుపోను రైతు వాటా రూ.3450లు చెల్లించాలి. నువ్వులు క్వింటా పూర్తి ధర రూ.15500లుగా నిర్ణయించారు. ఇందులో సబ్సిడీ రూ.6200లుపోను రైతు వాటా రూ.9300లు చెల్లించాలి. అలాగే వరి (25 కేజీల బ్యాగ్)ఐదు ఎకరాల దాకా 4 బ్యాగ్‌లు పంపిణీ చేస్తారు. కంది (4 కేజీల బ్యాగ్) ఐదు ఎకరాల దాకా 10 బ్యాగ్‌లు, ఉలవలు (4 కేజీల బ్యాగ్) ఐదెఎకరాల దాకా 10 బ్యాగ్‌లు, పెసలు (4 కేజీల బ్యాగ్) ఐదు ఎకరాల దాకా 10 బ్యాగ్‌లు, కొర్ర (2 కేజీల బ్యాగ్) ఐదు ఎకరాల దాకా 5 బ్యాగ్‌లు, రాగి, నువ్వులు, (2 కేజీల బ్యాగ్) ఐదు ఎకరాల దాకా 6 బ్యాగ్‌లు పంపిణీ చేస్తారు.

ఉన్నతి స్థానం

రుణాల రికవరీలో జిల్లాకు సెకెండ్ ప్లేస్


సెర్ప్ సీఈఓ నుంచి అవార్డు అందుకుంటున్న ఉన్నత ఏపీఎం మంజుల

అనంతపురం క్లాక్‌టవర్, మే 23(ఆంధ్రజ్యోతి): ఉన్నతి ఎస్సీ, ఎస్టీ రుణాల రికవరీలో జిల్లాకు ద్వితీయ స్థానం దక్కింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో డీఆర్‌డీఏ-వెలుగు ద్వారా స్వయం సహాయక సంఘాల ఎస్సీ, ఎస్టీ మహిళల నుంచి ఉన్నతి రుణాలు రికవరీ చేయడంలో మెరుగైన పురోగతి సాధించారు. జిల్లాలో పేరుకుపోయిన రూ.25.24కోట్ల రుణాలలో 2024 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2025 మార్చి 31లోపు ఏడాదిలోనే రూ.15.47కోట్లు రుణాలు రికవరీ చేశారు. దీంతో రాష్ట్రంలో ద్వితీయ స్థానం దక్కింది. ఇటీవల రాజధాని అమరావతిలో నిర్వహించిన కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ నుంచి డీఆర్‌డీఏ ఉన్నతి ఏపీఎం మంజుల అవార్డు అందుకున్నారు. డీఆర్‌డీఏ పీడీ శైలజ అవార్డు అందుకున్న ఏపీఎం మంజులను అభినందించారు.

క్రైం కార్నర్

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

ధర్మవరం, మే 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో తీవ్ర మనస్తాపం చెంది ధర్మవరం చెరువులో దూకి ఓ మహిళ శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని శివానగర్‌కు చెందిన లలిత(56) కూలి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేది. ఆమె కొంతకాలంగా మధుమేహ వ్యాధితో బాధపడుతుండేది. ఈ క్రమంలో కుడికాలికి ఇన్ఫెక్షన్ అయి బొటన వేలు తీసేశారు. ఆ బాధ భరించలేక తీవ్ర మనస్తాపం చెందింది. ఈ నేపథ్యంలోనే ధర్మవరం చెరువులోకి రెండో మరువ వద్ద దూకి ఆత్మహత్య చేసుకుంది. చెరువులో శవం తేలాడుతుండడాన్ని స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని, చెరువులోని మృతదేహాన్ని బయటకు తీశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లలితకు భర్త గోపాల్, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

మరో నిందితుడి లొంగుబాటు

రాప్తాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): రైతు దంపతులు చిగిచెర్ల నారాయణ రెడ్డి, చిగిచెర్ల ముత్యాలమ్మ హత్య కేసులో మరో నిందితుడు లొంగిపోయాడు. రాప్తాడు గ్రామానికి చెందిన పామళ్ల కొండప్ప శుక్రవారం రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడని రాప్తాడు సీఐ శ్రీ హర్ష తెలిపారు. హత్య కేసులో నిందితులుగా ఉన్న 11 మందిలో ఇప్పటికే ఆరుగురిని ఈనెల 19న అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు పేర్కొన్నారు. ఈనెల 21న ఈ కేసులో ఒక నిందితుడు బాల నరసింహారెడ్డి అనంతపురం కోర్టులో లొంగిపోయాడు. హత్య ఘటనలో గాయపడిన పామళ్ల కొండప్ప అనంతపురం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. శుక్రవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యి రాప్తాడు పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడన్నారు. అతడిని రిమాండుకు పంపామన్నారు. ఈ హత్య కేసులో మరో ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు.

యువతి అదృశ్యం

అనంతపురం క్రైం, మే 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని సుందరయ్యకాలనీకి చెందిన శ్రావణి అనే యువతి అదృశ్యమైంది. ఆమె బీటెక్ పూర్తి చేసి, పుట్టపర్తిలో గృహనిర్మాణ శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తోంది. ఈ నెల 22వతేదీ సాయంత్రం తన తల్లి రాధమ్మతో కలిసి రెండో రోడ్డులో అద్దె ఇల్లు చూసేందుకు వెళ్లింది. ఈ క్రమంలో ఓ ఇంట్లో మూడో అంతస్తుకు వెళ్లారు. తిరిగి కిందకు వచ్చే సమయంలో శ్రావణి త్వరగా దిగిపోయింది. తల్లి రాధమ్మ కిందికి వచ్చేసరికి శ్రావణి కనిపించలేదు. దీంతో ఆమె త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేపే యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

అనంతపురం టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): యుపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమనరీ పరీక్షను ఈనెల 25వ తేదీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 2,546 మంది అభ్యర్థులు జిల్లాలో పరీక్షలు రాయబోతున్నారన్నారు. ఏడు పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. పేపర్-1 పరీక్ష ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కొనసాగుతాయన్నారు. ఉదయం 9, మధ్యాహ్నం 2 గంటలు దాటిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షాకేంద్రాల్లోకి అనుమతించరన్నారు. అభ్యర్థులకు సమస్య తలెత్తితే పరిష్కారంకోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఇందుకోసం 8500292992, 08554-220009 నంబర్లను ఏర్పాటు చేశామనీ, అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

అటవీశాఖలో బదిలీలు

- ఖాళీల జాబితాను ప్రకటించిన అధికారులు..

అనంతపురం న్యూటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖలో బదిలీల ప్రక్రియ వేగవంతం చేశారు. క్షేత్రస్థాయి సిబ్బంది, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లకు సంబంధించి ఖాళీల జాబితాను కూడా యంత్రాంగం ప్రకటించింది. ఐదేళ్లు ఒకే చోట పూర్తి చేసిన వారు, వివిధ రకాల కారణాలతో బదిలీపై వెళ్లాలనుకొనే సిబ్బంది నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 9 సెక్షన్ ఆఫీసర్లు, 11 బీట్ ఆఫీసర్లతో పాటు 57 అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ స్థానాలు ఖాళీ ఉన్నట్లు జాబితా ప్రకటించారు. ఐదు సంవత్సరాలు ఒకే చోట పని చేసిన ఎనిమిది మంది బీట్ ఆఫీసర్లు తప్పనిసరిగా స్థాన చలనం పొందనున్నారు. మరో నలుగురు అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు కూడా ఐదేళ్లు పూర్తి చేసుకున్న జాబితాలో ఉన్నారు. దీంతో వీరికి కూడ బదిలీ తథ్యం అన్న సంకేతాలు వినిపిస్తున్నాయి. అందుకు అనుగుణంగా శుక్రవారం ఎంత సమయం అయినా జాబితా తయారు చేయాలని సిబ్బందిని డీఎఫ్ఓ ఆదేశించినట్లు తెలిసింది.

నేడు బదిలీల జాబితా..?

జిల్లా అటవీశాఖ అధికారి ఆదివారం నుంచి వ్యక్తిగత పనిపై నెలరోజుల పాటు సెలవులో వెలుతుండటంతో శనివారం క్షేత్రస్థాయి సిబ్బంది బదిలీ ప్రక్రియ పూర్తి చేసి వెళతారన్న చర్చ జరుగుతోంది. సిబ్బంది చేపట్టే చర్యలను బట్టి శనివారం బదిలీల జాబితా ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

నాణ్యమైన విత్తనం సరఫరా చేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ
- ప్రాసెసింగ్ యూనిట్‌లో తనిఖీలు

అనంతపురం అర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి): రైతు సేవాకేంద్రాలకు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలే సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయాధికారి.. ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. ఆర్డీటీ స్టేడియం సమీపంలోని జశ్వంత్ సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్‌లో ఆమె శుక్రవారం తనిఖీలు చేశారు. విత్తన వేరుశనగ ప్రాసెసింగ్‌తోపాటు నాణ్యతను పరిశీలించారు. ప్రాసెసింగ్ తీరుపై ఆరాతీశారు. ఆమె మాట్లాడుతూ... విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ పక్కాగా చేయడంతోపాటు మొలక శాతాన్ని పరిశీలించి, నాణ్యమైన విత్తన కాయలను మాత్రమే పంపిణీ కేంద్రాలకు పంపాలన్నారు. నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. నిబంధనలు ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ రాకేష్‌నాయక్, ప్రాసెసింగ్ యూనిట్ పర్యవేక్షణాధికారి శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ

అనంతపురం క్రైం, మే23(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పారా లీగల్ వలంటీర్లకు శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో శిక్షణ ఇచ్చారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్.. పారా లీగల్ వలంటీర్ల విధులు, వారు చేయాల్సిన పనుల గురించి వివరించారు. వలంటీర్లకు ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఉచిత ప్రజాప్రయోజన న్యాయసేవలు వినియోగించుకోవాలన్నారు. న్యాయవాది హరికృష్ణ.. పారా లీగల్ వలంటీర్లకు తగిన సూచనలు చేశారు.

పైపై మెరుగులు..?


రైల్వే స్టేషన్‌లో శిథిలావస్థకు చేరిన 7వ ప్లాట్‌ఫాం భవన సముదాయం

- ఎయిర్‌పోర్టులా కనిపిస్తున్న రైల్వేస్టేషన్
- గుంతకల్లు స్టేషన్ లోపలంతా డొల్లే
- శిథిలావస్థలో 70 ఏళ్లనాటి భవనం
- మరమ్మతులతో నెట్టుకొస్తున్న వైనం
- ఫలితంగా ఓ బాలుడి బలి

గుంతకల్లు, మే 23(ఆంధ్రజ్యోతి): బయట చూడటానికి గుంతకల్లు రైల్వే స్టేషన్ ఎయిర్ పోర్టును తలపించేలా ఉంటుంది. లోపలికెళ్లి చూస్తేగాని దాని డొల్లతనం బయటపడదు. రైల్వే స్టేషన్‌లో ఏడో నంబరు ప్లాట్‌ఫాంలో ఉన్న డెబ్బైయ్యేళ్లనాటి భవనాన్ని చూస్తే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం అవుతుంది. శిథిలావస్థకు చేరుకున్న ఈ భవనాన్ని మరమ్మతులతో నెట్టుకొస్తున్నారు. రైల్వే డివిజన్ ఏర్పాటైన కొత్తలో నిర్మించిన భవన సముదాయాన్ని ఇంకా అలాగే కొనసాగిస్తున్నారు. పాత భవనాలను తొలగిస్తామంటున్న అధికారులు వాటికి ఆనుకుని కొత్త రైల్వే స్టాళ్లను నిర్మిస్తుండటాన్ని ఏమనుకోవాలో తెలియని పరిస్థితి. రైల్వే అధికారుల ఈ నిర్లక్ష్యం కారణంగా గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఓ నిండు ప్రాణం పోయింది. రైల్వే కాంట్రాక్టరు చేసిన నాసిరకపు పని వల్ల ఓ కుటుంబానికి కడుపుకోత మిగిలింది.

1956 నాటి భవనం

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం ఏడో నంబరు ప్లాట్‌ఫాం ఒకప్పుడు ఒకటో నంబరు ప్లాట్‌ఫాంగా ఉండేది. గుంతకల్లు రైల్వే డివిజన్ 1956 అక్టోబరు 2న ఏర్పాటైంది. ఆ సందర్భంగా వివిధ కార్యాలయాల నిర్వహణకు అప్పటి 1-2 నంబర్ల (ఇప్పటి 6-7 నం.) ప్లాట్‌ఫాంలపై బ్రిటీషువారు నిర్మించిన భవనంపైనే అదనపు గదులను నిర్మించారు. గతంలో ఈ భవనం పైభాగంలో ఏసీబీ, ఐఆర్‌సీటీసీ కార్యాలయాలు, టీటీఈల విశ్రాంతి గదులు, జీఆర్పీ సీఐ కార్యాలయం, తదితర కార్యాలయాలను నిర్వహించారు. రైల్వే స్టేషన్‌కు కొత్త ఎంట్రెన్స్‌ను నిర్మించిన


ప్లాట్‌ఫాంపై శిథిలావస్థలో ఉన్న మరో గోడ


పాత భవన సముదాయానికి ఆనుకుని నిర్మిస్తున్న కొత్త స్టాళ్లు

మీదట ఏడో ప్లాట్‌ఫాం భవనాలపై ఉన్న ఆఫీసులను ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంలోకి మార్చారు. అప్పటి నుంచి పాత గదులను వినియోగించకుండా వదిలిపెట్టారు. కిందన ఉన్న భవనాల్లో ప్రయాణికుల విశ్రాంతి గదులు, ఏఎస్‌ఎం కార్యాలయం, జీఆర్పీ స్టేషన్, వివిధ ఆహార పదార్థాలను విక్రయించే స్టాళ్లను నిర్వహిస్తున్నారు.

పునర్నిర్మించే ఉద్దేశం ఉందా?

రైల్వే స్టేషన్‌లోని ఏడో నంబరు ప్లాట్‌ఫాంను పునర్నిర్మిస్తామంటూ అధికారులు చెబుతున్నా, వాస్తవ పరిస్థితులు మాత్రం ఇప్పట్లో అది సాధ్యం కాదని చెబుతున్నాయి. ఈ ప్లాట్‌ఫాంలో ఉన్న భవన సముదాయం శిథిలావస్థలో ఉండగా, పలుమార్లు మరమ్మతులు చేసి కొనసాగిస్తూ వస్తున్నారు. ఈ భవనాన్ని కూల్చేసి కొత్త భవనాన్ని నిర్మిస్తామంటూ గతంలో డీఆర్ఎం విజయకుమార్ ప్రకటించారు. కానీ అది సాధ్యం కాలేదు. అయితే ఇదే ప్లాట్‌ఫాంపై పాత భవనానికి ఆనుకుని కొత్త షాపుల నిర్మాణాన్ని చేపట్టారు. దీన్నిబట్టి పాత భవనాన్ని తొలగించి, పునర్నిర్మించే యోచన రైల్వే శాఖకు ఇప్పట్లో లేదని అర్థం అవుతుంది. ఈ భవనానికి ఎప్పుడూ ఏదో ఒక మరమ్మతు పనులు చేస్తూనే ఉంటారు. వెయిటింగ్ హాళ్లకు మరమ్మతులు చేసి పైకప్పునకు పీఓపీ వేసి వినియోగిస్తున్నారు. ప్రయాణికుల వేచి ఉండే గదులు బయటకు బాగానే కనిపిస్తున్నా ఎప్పుడు పైకప్పు పెచ్చులు ఊడిపడతా యోనన్న భయం వెంటాడుతోంది. పెచ్చులు ఊడిపడి శుక్రవారం ఓ బాలుడు మరణించిన వెంటనే అధికారులు స్పందించారు. ఈ భవన సముదాయాలలో వదులైన పెచ్చులను తొలగించే పనిలో పడ్డారు.

కమీషన్ల కక్కుర్తితో అనర్థం..



రైల్వేలో జరుగుతున్న పనులు అత్యంత నాసిరకంగా ఉంటున్నాయి. కాంట్రాక్టరు నిర్వాకం వల్లే రైల్వే స్టేషన్‌లో ప్రమాదం జరిగి బాలుడు మృతి చెందాడు. ఈ విషయంగా రైల్వే శాఖ బాధ్యత వహించాలి. బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారాన్ని ఇచ్చి, కుటుంబంలో ఒకరికి రైల్వే ఉద్యోగాన్ని ఇవ్వాలి. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– జగదీశ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు

అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం..



డివిజనల్ హెడ్‌క్వార్టర్సులోని భవనాల పరిస్థితి ఇలా ఉండటం రైల్వే శాఖ నిర్లక్ష్యానికి నిదర్శనం. రైల్వే స్టేషన్‌లో ప్రమాదకర పరిస్థితులున్నా పట్టించుకోకపోవడం శోచనీయం. ఈ ఘటనపై శాఖాపరమైన విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి. బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. వెంటనే భవన సముదాయాన్ని కూల్చి పునర్నిర్మించాలి.

– శ్రీనివాసులు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన డీఆర్ఎం


పెచ్చులూడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, మే23(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లోని ఏడో నంబరు ప్లాట్‌ఫాంపై పెచ్చులూడిపడి బాలుడు మరణించిన సమాచారం తెలుసుకున్న డీఆర్ఎం చంద్రశేఖర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. శుక్రవారం తెల్లవారుజామున ఏడో నంబరు ప్లాట్‌ఫాం గోడకు వేసిన ప్లాస్టింగ్ పెచ్చు ఊడి పడటంతో కర్నూలుకు చెందిన మణికంఠ అనే బాలుడు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న డీఆర్ఎం సంఘటనా స్థలాన్ని సందర్శించి, సంబంధిత అధికారులతో చర్చించారు. బాలుడు మరణించిన సంఘటన విషయంగా వివరాలను తెలుసుకున్నారు. ప్రమాద పరిస్థితులున్న చోట వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

బాలుడి మృతిపై విచారణ చేపట్టాలి

- వామపక్ష నాయకుల డిమాండ్

గుంతకల్లు, మే23(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లో పెచ్చులూడిపడి మరణించిన బాలుడి సంఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. రైల్వే స్టేషన్‌లో బాలుడు మరణించిన ప్రదేశాన్ని సీపీఐ, సీపీఎం నాయకులు శుక్రవారం ఉదయం పరిశీలించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ మాట్లాడుతూ రైల్వే నిర్మాణ పనులు అత్యంత నాసిరకంగా ఉంటున్న కారణంగానే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదం విషయంగా రైల్వే మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేస్తామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బీ శ్రీనివాసులు మాట్లాడుతూ బాలుడి మృతి సంఘటన రైల్వే శాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారాన్ని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బీ గోవిందు, వీరభద్రస్వామి, బీ మహేశ్, గోపి, మహమ్మద్ గౌస్, రాయల్ రాము, సీపీఎం నాయకులు మారుతీ ప్రసాద్, సాకే నాగరాజు, తిమ్మప్ప, రాము, వంశీ, కర్ణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.


పెచ్చులూడిన ప్రాంతాన్ని చూపుతున్న సీపీఎం నాయకుడు శ్రీనివాసులు


పెచ్చులూడిన ప్రదేశాన్ని చూపుతున్న సీపీఐ నాయకుడు జగదీశ్

ఎంతపని చేశావమ్మా..!

- కుమారుడికి నిప్పుపెట్టి.. ఉరి వేసుకోబోయిన తల్లి
- అడ్డుకున్న స్థానికులు.. అప్పటికే పసివాడు బలి

బుక్కరాయసముద్రం, మే 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న కుమారుడికి వైద్యం చేయించకుండా భర్త నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆమె ఆవేదనకు గురైంది. కొడుకుతో కలిసి బలవన్మరణానికి పాల్పడాలని భావించింది. కట్టుకునే చీరలలో తొమ్మిది నెలల పసివాడిని చుట్టి, నిప్పు పెట్టింది. తాను ఉరివేసుకునేందుకు సిద్ధమైంది. ఇంట్లోంచి పొగలు రావడంతో ఇరుగూపొరుగువారు పరుగున వెళ్లి చూశారు. ఆమె ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. కానీ బాలుడు చరణ్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు, కంబదూరు మండలం పర్వతదేవనిపల్లికి చెందిన ఎరికల వెంకటేశ్వర్లు జీవనోపాధి కోసం బుక్కరాయసముద్రం గ్రామ పంచాయతీలోని జనచైతన్య కాలనీలో ఉంటున్నాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మొదటి భార్య ఆత్మహత్య చేసుకుంది. అనంతరం కంబదూరు మండలం చెర్లోపల్లికి చెందిన వనజను రెండో వివాహం చేసుకున్నాడు. వీరి కుమారుడు చరణ్‌కు పుట్టుకతోనే జీర్ణకోశ సంబంధిత వ్యాధి సంక్రమించింది. చాలాచోట్ల చికిత్స చేయించారు. కానీ కుమారుడి వైద్యం విషయంలో భర్త నిర్లక్ష్యం వహిస్తున్నాడని వనజ గొడవ పడేది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం తమ ఇంట్లో తొలుత కొడుకు చరణ్‌ను చీరలలో చుట్టి నిప్పుపెట్టింది. అనంతరం ఉరి వేసుకుంటుండగా స్థానికులు అడ్డుకున్నారు. మంటల్లో చిక్కుకున్న కుమారుడిని కాపాడుకునేందుకు వనజ ప్రయత్నించింది. మండుతున్న చీరల్లో ఉన్న కొడుకును ఎత్తుకుని బయటకు వచ్చి మురుగునీటి కాలువలో పడుకుంది. దీంతో మంటలు ఆరిపోయినా, అప్పటికే తీవ్రంగా గాయపడిన చరణ్ మృతి చెందాడు. గాయపడిన వనజను కాలనీవాసులు అనంతపురం సర్వజన వైద్యశాలలో చేర్పించారు. తన భార్య ఉద్దేశపూర్వకంగానే తన కుమారుడిని హత్య చేసిందని వెంకటేశులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని బుక్కరాయసముద్రం సీఐ పుల్లయ్య తెలిపారు.


చరణ్ (ఫైల్)


చికిత్స పొందుతున్న వనజ

ఉగ్రవాదంపై పోరును వక్రీకరించొద్దు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


సమైక్యతా యాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, మే 23(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఘటన నేపథ్యంలో భారత్.. ఉగ్రవాదంపై పోరులో భాగంగానే పాకిస్థాన్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిందనీ, దానిని మతాల మధ్య పోరాటంగా మలచొద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 30వతేదీ వరకు చేపడుతున్న సమైక్యతా యాత్ర కరపత్రాలను స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. రాంభూపాల్ మాట్లాడుతూ... పహల్గాంలో పర్యాటకుల మతాన్ని తెలుసుకుని కాల్పులు జరపడం ద్వారా ఉగ్రవాదులు దేశంలో విద్వేషాలను రెచ్చగొట్టాలని పథకం పన్నారన్నారు. దీనిని దేశప్రజలు సమైక్యంగా తిప్పికొట్టారన్నారు. కొన్ని మతోన్మాదశక్తులు.. ఉగ్రవాదానికి మతంతో ముడివేసి ప్రజల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నాయని వాపోయారు. ఇలాంటి శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, బాలరంగయ్య, రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, మూర్తుజా పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి: ఈఎస్

అనంతపురం అర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు మద్యం షాపులు, బార్ల నిర్వహణలో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి ఆదేశించారు. సూపరింటెండెంట్ కార్యాలయం నుంచి శుక్రవారం ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మద్యం షాపులు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల దాకా మాత్రమే తెరవాలన్నారు. బార్లు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల దాకా విక్రయాలు చేసుకోవాలన్నారు. మద్యం షాపులు, బార్లల్లో సమయపాలన పాటించేలా రాత్రి సమయాల్లో ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జడ్పీ సీఈఓపై బదిలీ వేటు

- ప్రభుత్వం వద్ద రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశాలు
- డిప్యూటీ సీఈఓకు ఎఫ్ఏసీ బాధ్యతలు


బదిలీ అయిన సీఈఓ రామచంద్రారెడ్డి

అనంతపురం విద్య, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సీఈఓ రామచంద్రారెడ్డిపై బదిలీ వేటు పడింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో 396ను శుక్రవారం విడుదల చేసింది. డిప్యూటీ సీఈఓకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. సీఈఓ రామచంద్రారెడ్డిని ప్రభుత్వం వద్ద రిపోర్ట్ చేసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 21న జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ చాంబర్‌లో జగన్ ఫొటో వివాదం జరిగిన 48 గంటల్లోనే జడ్పీ సీఈఓపై బదిలీ వేటు పడటం జిల్లాలో రాజకీయ, ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా నంద్యాల డ్వామా పీడీగా పనిచేస్తున్న ఆర్. రామచంద్రారెడ్డిని గత ఏడాది సెప్టెంబరు 22న అనంతపురం జడ్పీ సీఈఓగా నియమించారు. అయితే ఆయన దీర్ఘకాలిక సెలవులో ఉండటంతో అప్పట్లో విధుల్లో చేరలేదు. సెలవులు ముగించుకుని వచ్చిన ఆయన డిసెంబరు 28న ఆయన విధుల్లో చేరారు. ఆరు నెలలు కూడా తిరక్కుండానే బదిలీపై వెళ్లాల్సి వచ్చింది.

హీటెక్కిన ఫొటో పాలిటిక్స్.. 48 గంటల్లో వేటు..!

జడ్పీలో ఈనెల 21న జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆ రోజు జడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో మాజీ ముఖ్యమంత్రి జగన్ ఫొటో ఉండటం చూసి ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, దగ్గుబాటి వెంకటప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు అభ్యంతరం తెలుపుతూ, గట్టిగానే ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యాలయంలో జగన్ ఫొటో ఎలా పెడతారంటూ ఫైర్ అయ్యారు. ఈ క్రమంలో సీఈఓ నుంచి సానుకూల దృక్పథంతో కూడిన సమాధానం రాకపోవడంపై ఉద్యోగుల్లో చర్చ మొదలైంది. తర్వాత జగన్ ఫొటోను తొలగించినా...గత రెండు రోజులుగా జిల్లాలో ఫొటో రాజకీయాలు వేడెక్కాయి. వైసీపీ ప్రజాప్రతినిధులు హాట్ హాట్ కామెంట్స్ చేస్తూ వచ్చారు. వైసీపీ మాజీ ఎంపీ మాధవ్ ఏకంగా పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేశారు. దీంతో ఈ వ్యవహారం మరింత హీటెక్కింది. రెండు రోజులుగా జిల్లాలో టీడీపీ, వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల మధ్య జగన్ ఫొటో తొలగింపు మాటలు మంటలు రేపాయి. ఈ క్రమంలో జడ్పీలో ఫొటో వివాదం తలెత్తిన 48 గంటల్లోనే సీఈఓపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది.

న్యూస్ బాక్స్

పాండురంగస్వామి నిజపాద దర్శనం


పూజలందుకున్న రుక్మిణీ పాండురంగ స్వామి

అనంతపురం కల్చరల్, మే 23(ఆంధ్రజ్యోతి): వైశాఖ బహుళ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం రామ్‌నగర్‌లోని రుక్మిణీ పాండురంగస్వామి దేవాలయంలో స్వామి నిజపాద దర్శన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూలవిరాట్లకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు విరివిగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో భావసార్ క్షత్రియ సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు తిరుపతిరావు, ఆనంద్, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం


చైర్మన్‌ను సన్మానిస్తున్న రాయల్ మురళి, కూచి హరి

అనంతపురం అర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి): వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా నియమితులైన ఈశ్వర్‌ను జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు సన్మానించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, పార్టీ ప్రచార కార్యదర్శి కూచి హరి శుక్రవారం ఈశ్వర్‌ను గుంటూరులోని ఆయన నివాసంలో శాలువ కప్పి సన్మానించారు.

టీడీపీ గ్రామ కమిటీ ఎంపిక

రాప్తాడు, మే23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లిలో శుక్రవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమావేశమై గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోయ ముట్టాల ఓబులపతి, ప్రధాన కార్యదర్శిగా తమ్మినేని నరేష్ కుమార్, ఉపాధ్యక్షుడిగా వరిమడుగు కురుబ రాంగోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిని శాలువాలు, పుష్పగుచ్ఛాలతో అభినందించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, వెంకట్రాముడు, దేవర నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ప్రేమ పంచడమూ దైవత్వమే

● శృంగేరి శారదాపీఠం దక్షిణాధికారి విధుశేఖర భారతీస్వామి


లండన్ బుక్ ఆఫ్ రికార్డు పత్రం అందుకుంటున్న విజయ సాయికుమార్

అనంతపురం కల్చరల్, మే 23(ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులకు ప్రేమను పంచడం కూడా దైవత్వమేనని శృంగేరి శారదా పీఠం దక్షిణాధికారి విధుశేఖర భారతీ స్వామి పేర్కొన్నారు. సాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సామూహిక షష్టిపూర్తి కార్యక్రమానికి లండన్ బుక్ ఆఫ్ రికార్డు లభించింది. ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని శుక్రవారం శారదానగర్‌లోని శంకరమఠంలో స్వామీజీ చేతులమీదుగా విజయసాయికుమార్ అందుకున్నారు. ఈ సందర్భంగా విధుశేఖర భారతీ స్వామి మాట్లాడుతూ... సొంత తల్లిదండ్రులను సైతం విస్మరిస్తున్న ప్రస్తుత కాలంలో ఎంతో మంది వృద్ధులకు సాయి ట్రస్టు సేవలందిస్తుండడం అభినందనీయమన్నారు. వృద్ధులు, అనాథలకు సేవలందించేందుకు మరింత మంది ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సాయి ట్రస్టు సభ్యులు రాఘవేంద్ర, నారాయణ నాయక్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో సీట్ల మార్పు

అనంతపురం క్రైం, మే 23(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కొందరి సీట్లు మార్చారు. ఈ మేరకు నగర కమిషనర్ బాలస్వామి శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. ఆర్‌ఐగాను, ఇన్‌చార్జ్ మేనేజర్‌గా ఉన్న లక్ష్మీదేవికి ఆర్‌ఐగానే కేటాయించారు. పబ్లిక్‌హెల్త్ విభాగం సూపరింటెండెంట్‌గా ఉన్న సుజాతను ఇన్‌చార్జ్ మేనేజర్‌గా, పబ్లిక్‌హెల్త్ విభాగం ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఏ1 క్లర్క్ శ్రీకాంత్‌ను కమిషనర్ సీసీగా, పింఛన్ విభాగం సీనియర్ సునీల్‌ను ఏ1 క్లర్క్‌గా, బిల్ కలెక్టర్ నరసింహమూర్తిని ఏ3 క్లర్క్‌గా, శిక్షణ పూర్తి చేసుకున్న భవానిని ఏ6 క్లర్క్‌గా నియమించారు. అదేవిధంగా రికార్డ్‌రూమ్ క్లర్క్ వెంకటేష్‌ను పీజీఆర్‌ఎస్‌కు కేటాయించారు.

భవిత కేంద్రాల్లో చేర్పించండి : ఎంఈఓ


ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్న అధికారులు

రామగిరి, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రత్యేక అవసరాలతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రాలలో చేర్పించాలని ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఐఆర్‌టీతో కలిసి ఆయన ఇంటింటికివెళ్లి ప్రత్యేక అవసరాలతో బాధపడుతున్న పిల్లలను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. అంగవైకల్యం, వినికిడి గల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేర్పించే లా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాధ, రేణుక పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

రాప్తాడు, మే 23(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వృద్ధుడు ఈ నెల 15న గంగలకుంటకు వెళ్లే దారిలో ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందాడని రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. ఆ వృద్ధుడు అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడని తెలిపారు. వృద్ధుడి మృతదేహం ప్రభుత్వాసుపత్రిలో మార్చురీలో ఉందని, ఆచూకీ తెలిసినవారు రాప్తాడు పోలీసులను సంప్రదించాలని సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మరో వృద్ధుడు...

అనంతపురం క్రైం, మే 23(ఆంధ్రజ్యోతి): నగర శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేశవరెడ్డి (73) అనే వ్యక్తి అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డిలోని ఓ బోర్‌వెల్స్‌లో పనిచేస్తుండేవాడు. అతడు గురువారం బైక్‌లో వెళ్తుండగా సోములదొడ్డి సమీపంలో మరో బైక్ ఢీ కొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలకు గురైన కేశవరెడ్డిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేశవరెడ్డి అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు.

కడప తరహాలోనే అనంత మేయర్ పరిస్థితి

● త్వరలోనే అవినీతి బయటకొస్తుంది: ఎమ్మెల్యే
● రూ.2.05 కోట్ల విలువైన స్వచ్ఛ వాహనాల ప్రారంభం


స్వచ్ఛ వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా

అనంతపురం అర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి): కడప మేయర్ తరహాలోనే అనంతపురం నగర మేయర్ అవినీతి త్వరలోనే బయటకొస్తుం దని, ఆయనపైనా చర్యలు తప్పవని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. అనంతపురం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద శుక్రవారం రూ.2.05 కోట్ల విలువైన స్వచ్ఛ వాహనాలను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, నగర కమిషనర్ బాలస్వామితో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రారంభించారు. ఎన్‌క్యాప్, స్వచ్ఛ ఆంధ్ర, జనరల్ ఫండ్స్‌తో రెండు స్వీపింగ్ మిషన్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనం, లాడర్, డస్ట్‌ను తగ్గించే స్ప్రింక్లర్ వాహనాలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ... నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గత ఐదేళ్లల్లో నగర పాలక సంస్థను భ్రష్టు పట్టించారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే గాడిలో పెట్టామన్నారు. వైసీపీ పాలనలో చిన్న డ్రైన్‌ను కూడా శుభ్రం చేయలేదని, రోడ్లు, కాలువలు నిర్మించలేదని విమర్శించారు. డంపింగ్ యార్డు విషయంలో మేయర్ వసీం, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి రూ. 22 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇందులో ఇప్పటి దాకా రూ. 9 కోట్ల దాకా నిరూపితమైందని, త్వరలోనే సమగ్ర రిపోర్టు రానుంద న్నారు. కడప మేయర్ చేసిన రూ.36 లక్షల అవినీతికే పదవి పోయిం దని... ఇక్కడ డమ్మీ మేయర్, మాజీ ఎమ్మెల్యేలు చేసిన అవినీతిపైనా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. గత పాలనలో నగరంలో ప్లాస్టిక్ విచ్చలవిడిగా కనిపించిందని, అడిగేవారే లేరన్నారు. తమ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చినప్పటి నుంచి ప్లాస్టిక్ నిర్మూలనకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వాస్పత్రిలో మల్టీ లెవల్ పార్కింగ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పీపీపీ మోడల్‌లో అనంతపురం మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులతో పాటు జనరల్ ఫండ్స్‌తో నగరం లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్, నాయకులు పీఎల్‌ఎన్ మూర్తి, బాలాంజినే యులు, బాబాఫకృద్దీన్, లాలెప్ప, రమేష్, లక్ష్మీనరసింహ, డీకే రామలింగం, నగర పాలక సంస్థ అధికారులు షాకీర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రూ.11కోట్ల బిల్లుల్లో.. రూ.9కోట్ల అవినీతా?

● ఎమ్మెల్యే వ్యాఖ్యలపై మేయర్ వసీం


కొత్తగా వచ్చిన యంత్రాల వద్ద మేయర్ తదితరులు

అనంతపురం క్రైం, మే 23(ఆంధ్రజ్యోతి): డంపింగ్‌యార్డ్‌లో తాను రూ. 9కోట్ల అవినీతికి పాల్పడినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతున్నారని, బిల్లు చెల్లించిందే రూ. 11కోట్ల లోపు అయితే రూ. 9కోట్ల అవినీతికి ఆస్కారం ఎక్కడ అని నగర మేయర్ మహమ్మద్ వసీం ప్రశ్నించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా నగర పాలక సంస్థకు మంజూరైన యంత్రాలను ఆయన శుక్రవారం డిప్యూటీ మేయర్ సాహిత్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పదేపదే అవాస్తవాలు మాట్లాడుతూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. నగరంలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సహకారంతో రూ. 1,045 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ఎమ్మెల్యే అబద్ధాలతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో నగర ప్రజలకు తెలుసన్నారు. మీ ప్రభుత్వమే అధికారంలో ఉందని, డంప్‌యార్డ్ బయో మైనింగ్‌పై త్వరిత గతిన విచారణ చేయించాలన్నారు. ఎవరు డమ్మీనో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, సైఫుల్లాబేగ్, శ్రీనివాసులు, ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈ షాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మీ అవినీతిని ప్రశ్నిస్తే... మైనార్టీలను అవమానించినట్లా..?

● మేయర్‌పై టీడీపీ కార్పొరేటర్లు, నాయకుల మండిపాటు

అనంతపురం అర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి): మీ అవినీతిపై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రశ్నిస్తే మైనార్టీలను అవమానపర్చినట్లా..? అని మేయర్ వసీంపై టీడీపీ కార్పొరేటర్లు, నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో కార్పొరేటర్లు బాబా ఫకృద్దీన్, బాలాంజినేయులు, నాయకులు మధుసూదన్‌గౌడ్, రాయల్ మధు, లక్ష్మీనరసింహ మాట్లాడారు. మీ హయాంలో జరిగిన అవినీతిపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రశ్నించారని, ఆయన ఎక్కడా మైనార్టీల గురించి మాట్లాడలేదన్నారు. మిమ్మల్ని ప్రశిస్తే మైనార్టీలను కించపరిచినట్లుగా చిత్రీకరించి మాట్లాడటం పద్ధతి కాదన్నారు. కేవలం డంపింగ్ యార్డులో జరిగిన అవినీతిపైనే ఎమ్మెల్యే మాట్లాడుతున్నారని.. ఇంకా ఇతర పనుల్లో జరిగిన అవినీతి గురించి మీ పార్టీ కార్పొరేటర్లే చెప్పిన విషయాలు గుర్తుకు రావడం లేదా..? అని ప్రశ్నించారు. మీరు ఎలాంటి అవినీతి చేయకపోతే మీ నిజాయితీని నిరూపించుకోవాలని, ఇప్పటికైనా రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని మేయర్‌కు హితవు పలికారు.

అవినీతి, అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

● టీడీపీ మైనార్టీ నాయకుల సవాల్

అనంతపురం అర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన అవినీతిపై చర్చకు సిద్ధమా అని టీడీపీ మైనార్టీ విభాగ నాయకులు మేయర్ వసీంకు సవాల్ విసిరారు. టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు సైఫుద్దీన్, ఫిరోజ్ అహ్మద్, జేఎం బాషా శుక్రవారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో మాట్లాడారు. అనవసరంగా అవాకులు, చవాకులు పేలితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. డంపింగ్ యార్డులో అవినీ తిపై సాక్షాత్తు ఇద్దరు డిప్యూటీ మేయర్లు మాట్లాడిన విషయాన్ని మర్చి పోయారా అని ప్రశ్నించారు. అసలు మీరు మేయర్‌గా పనికిరారని వార న్నట్లు గుర్తు చేశారు. మీరు ఏ విధంగా మేయర్ అయ్యారన్నది చాలా మందికి తెలియదనీ, దాని వెనుక దాగి ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్, పెన్‌డ్రైవ్‌లో విషయాలు బయటకు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. మీ సొంత డివిజన్‌లో డ్రైనేజీ వ్యవస్థ ఎలా ఉందో చూడాలన్నారు. గత ఐదేళ్లలో మీరు చేసిన దోపిడీపై అన్ని వివరాలు త్వరలోనే బయటకు వస్తాయన్నారు. నాయకులు మోహన్‌కుమార్, బాలాంజినేయులు పాల్గొన్నారు

సొసైటీల లావాదేవీలు ఆన్‌లైన్‌లోనే చేయాలి

● జేసీ, ఏడీసీసీ బ్యాంకు పీఐసీ శివనారాయణ శర్మ


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శివనారాయణశర్మ

అనంతపురం క్లాక్‌టవర్, మే 23(ఆంధ్రజ్యోతి): కంప్యూటరైజేషన్ పూర్తి అయిన సందర్భంగా సొసైటీల నిర్వహణ, లావాదేవీలు, ఆడిట్ అన్నీ ఆన్‌లైన్‌లోనే చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, ఏడీసీసీ బ్యాంకు పీఐసీ శివ నారాయణశర్మ ఆదేశించారు. రెండు రోజులుగా స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో సొసైటీ ఆన్‌లైన్ నిర్వహణపై జరుగుతున్న అవగాహన సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడీసీసీ బ్యాంకుల బ్రాంచ్‌లు, సొసైటీల వారీగా కంప్యూటరైజేషన్‌ను సమీక్షించారు. ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లోనే ఉంచాలని సూచించారు. మాన్యువల్ చేస్తే అంగీకరించేదిలేదన్నారు. సొసైటీల అభివృద్ధికి ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యతగా పనిచేయాలన్నారు. మొండి బకాయిలు ఎన్‌పీఏ తగ్గించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి, సహకార శాఖ అధికారులు, ఏడీసీసీ బ్యాంకు, సొసైటీల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల వేలం

అనంతపురం క్రైం, మే 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం బైక్‌లు వేలం వేశారు. సీఐ సాయినాథ్ ఆధ్వర్యంలో17 బైక్‌లు బహిరంగ వేలం వేయగా రూ.1,01,900 నగదు వసూలైనట్లు సీఐ తెలిపారు.

జేఎన్టీయూలో మెటల్ ఇంజెక్షన్ మోల్డింగ్ ఇంక్యుబేషన్

● తిరుపతి ఇండో ఎంఐఎంను సందర్శించిన వీసీ


వీసీ సుదర్శనరావును సన్మానిస్తున్న కంపెనీ ప్రతినిధులు

అనంతపురం సెంట్రల్, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అగ్రశ్రేణి మెటల్ ఇంజెక్షన్ మోల్డింగ్ ఇంక్యుబేషన్‌ను జేఎన్టీయూలో ఏర్పాటు చేయబోతున్నామని వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు తెలిపారు. ఆయన శుక్రవారం తిరుపతి ఇండో- ఎంఐఎం(మెటల్ ఇంజెక్షన్ మోల్డింగ్)ను సందర్శించారు. ఆటోమోటివ్, ఏరోస్పేస్, మెడికల్, డిఫెన్స్, కన్స్యూమర్ ఉత్ప త్తుల వంటి పరిశ్రమలకు కాంపొనెంట్ ఉత్పత్తుల్లో ఇండో-ఎంఐఎం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని వీసీ పేర్కొన్నారు. ఈ సంస్థలో జేఎన్టీయూ విద్యార్థులకు పరిశోధన అవకాశాలు కల్పించి, ఉద్యోగాలు పొందేలా ఇంక్యుబేషన్‌ను ఏర్పాటుచేసేందుకు కంపెనీ ప్రతినిధులను సంప్రదించడంతో సానుకూల స్పందన లభించిందని వీసీ తెలిపారు.

పీఏబీఆర్ నుంచి పల్లెపల్లెకూ తాగునీరిస్తాం

● ఎమ్మెల్యే పరిటాల సునీత ● పైప్‌లైన్ పనుల పరిశీలన


వడ్డుపల్లి సమీపంలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఆత్మకూరు, మే 23(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ నుంచి ప్రతి పల్లెకు తాగునీరు సరఫరా చేసి తాగునీటి సమస్య లేకుండా చేస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. పైపులైను పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. మండల పరిదిలోని వడ్డుపల్లి సమీపాన ఫారెస్టులో జరుగుతున్న పీఏబీఆర్ పైపులైను పనులను ఎమ్మెల్యే శుక్రవారం స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు. పనులను వేగవంతంగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 97కోట్లు నిధులతో పనులు చేపట్టినట్లు తెలిపారు. పీఏబీఆర్ నుంచి ఆత్మకూరు వరకు పైపులైను దాదాపు పూర్తి అయిందని, ఆత్మకూరు నుంచి అనంతపురం వరకు పనులు పనులు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆత్మకూరు మండలంలో 17 పంచాయతీలకు, అనంతపురం రూరల్ మండలంలోని 23గ్రామాలకు తాగునీటి సమస్య తీరుతుందని తెలిపారు. ఇచ్చిన మాట మేరకు ప్రజలకు ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ఎన్ని అడ్డంకులు ఏర్పడినా ప్రజలకు అవసరమైన పనులు చేయడానికి తమ ప్రభుత్వం వెనుకాడదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు శశాంక చౌదరి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా నీటి తొట్టె..!

● పాఠశాల ఎదుట, రోడ్డు పక్కనే ఏర్పాటు


పాఠశాల ఎదుట ప్రహరీ పక్కనే ఉన్న పశువుల నీటి తొట్టె

అనంతపురం రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద మండలంలో పశువుల కోసం నీటి తొట్టెల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన విషయం విదితమే. ఇది మంచి నిర్ణ యమే. తొట్టెల ఏర్పాటు పశువులకు అనుకూలంగా ఉండటంతోపాటు ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండాలి. రాచానపల్లిలో తొట్టె ఏర్పాటు చేసిన తీరు పలు విమర్శలకు తావిస్తోంది. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆనుకుని ఏర్పాటు చేయడమే ఇందుకు ప్రధాన కారణం. ప్రస్తుతం పాఠశాలకు వేసవి సెలవులు కావడంతో పిల్లలు బడికిరావడం లేదు. మరో 20రోజుల్లో పాఠశాల పునఃప్రారంభం అవుతుంది. ఈ నేపథ్యంలో పిల్లలు ఆడుకుంటూ ఆ నీటి తొట్టెలో పడే అవకాశం లేకపోలేదు. జరగాని ప్రమాదం ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనికితోడు అక్కంపల్లి, రాచానపల్లికి వెళ్లే రోడ్డుకు ఆనుకుని ఈ తొట్టెను ఏర్పాటు చేశారు. నిత్యం పదుల సంఖ్యలో రాత్రింబగళ్లు వాహనాలు సంచరిస్తుంటా యి. ఈ సందర్భంగా పొరపాటున వాహనాదారులు తొట్టెను ఢీకొనే అవకాశాలూ లేకపోలేదంటున్నారు. ఇవేవీ ఆలోచించకుండా నీటి తొట్టెను ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న చోట్ల ఏర్పాటు చేయడం ఏమిటన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలకు వచ్చే పిల్లలు, గ్రామాల మధ్య రాకపోకలు సాగించే వాహనదారులను దృష్టిలో ఉంచుకుని పశువుల నీటి తొట్టెను మరో చోట ఏర్పాటు చేయాలని అంటున్నారు.

భరతమాత కీర్తి కిరీటం ఆర్మీ

● తిరంగా ర్యాలీలో పలువురు వక్తలు


నందమూరి నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అనంతపురం రూరల్/సెంట్రల్, మే 23(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌తో ఇండియన్ ఆర్మీ సత్తాను ప్రపంచానికి పరిచయం చేశారని పలువురు వక్తలు అన్నారు. భరతమాత కీర్తికిరీటం అని కొనియాడారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో సైనికులకు సంఘీభావంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. మండలంలోని కక్కలపల్లి పంచాయతీ నందమూరినగర్‌లోని నరిగమ్మ ఆలయం నుంచి పాపంపేట మీదుగా కళ్యాణదుర్గం బైపాస్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు కొనకొండ్ల రాజేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఓలేటి రత్నమయ్య, రావి చైతన్యకిశోర్, లలిత్, అజేష్‌యాదవ్, పెద్దయ్య, తాడాల నాగభూషణం, లక్ష్మీదేవి, రామాంజినేయులు, శ్యామ్ సుందర్, రంగనాయకులు, సైఫుల్లాఖాన్, హరీష్‌రెడ్డి, సాకే పవన్‌కుమార్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

నార్పలలో భారీ త్రివర్ణ పతాకంతో ర్యాలీ


500 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న దృశ్యం


ర్యాలీలో పాల్గొన్న నాయకులు

నార్పల, మే 23(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్ పీచమణిచిన భారత సైనిక దళాలకు మద్దతుగా మండల కేంద్రంలో శుక్రవారం టీడీపీ నాయకుడు ఆకుల విజయ్‌కుమార్, బీజేపీ నాయకుడు వడ్డి ప్రభాకర్ రెడ్డి, సామాజిక సేవకులు గవ్వల శివ సారథ్యంలో భారీగా తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఇందులో 500 అడుగుల జాతీయ పతాకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆ జాతీయ పతాకాన్ని పదర్శిస్తూ వందేమాతరం నినాదంతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర క్రీడామైదానం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ప్రధాన రహదారిలో ర్యాలీ సాగింది. ర్యాలీలో నార్పల ప్రజలు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఈడిగ శ్రీధర్, పసుపులేటి లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు దామోదర్, కాశీవిశ్వనాథ్, మాధవ్, సుదర్శన్, మైనార్టీ నాయకులు మహమ్మద్ సాలెహ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై కొనసాగిన తనిఖీలు

అనంతపురం క్రైం, మే23(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్లాస్టిక్ విక్రయాలపై తనిఖీలు శుక్రవారం కొనసాగాయి. పాతూరుతో పా టు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. నగరంలో మొత్తం రూ.70,025 జరిమానా విధించారు. కాగా పాతూరులో పలు దుకాణాలపై తనిఖీ సమయంలో ప్రైవేట్ వ్యక్తులు అత్యుత్సాహం చూపారు. జరిమానా రూ.20వేలు వేయాలని అధికారులు చెప్పారు కదా, మీకేమైనా లావాదేవీలున్నాయా అంటూ అడిగారట. ఈ క్రమంలో శానిటేషన్ సెక్రటరీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వారితో వాదనకు దిగారు.

తీర్మానాల ఆమోదంపై హర్షం

రాప్తాడు, మే 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడులో పలు తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించడం ఎంతో అభినందనీయమని టీడీపీ మండల కన్వీనర్ పంపు కొండప్ప, సర్పంచ్ సాకే తిరుపాలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం రామగిరిలో రాప్తాడు నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు నిర్వహించారన్నారు. ఈ మహానాడులో ఎమ్మెల్యే పరిటాల సునీత నియోజకవర్గంలోని 22 అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. అందులో రాప్తాడు మండలంలో పండమేరు వంకపై బ్రిడ్జి ఏర్పాటు, పండమేరు వంక పక్కన పార్కు ఏర్పాటు, రాప్తాడు రైల్వే బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని తీర్మానాలు చేశారన్నారు.

ప్రశాంతతకు చిరునామా యోగా: డీఎంహెచ్ఓ


యోగాసనాలు వేస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, మే 23(ఆంధ్రజ్యోతి): మానసిక, శారీరక ప్రశాంతతకు యోగా చిరునామాగా నిలుస్తోందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా చేపట్టిన యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో యోగాసనాలు నిర్వహించారు. యోగా తోనే అనేక రకాల జబ్బులను మందులు లేకుండానే నివారించుకో వచ్చని డీఎంహెచ్ఓ తెలిపారు. ప్రతిఒక్కరూ రోజూ గంటపాటు యోగా చేస్తే మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ కోటిరెడ్డి, డీఎస్పీ వాసుదేవ్, ఆర్ఐ వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ శైలజ, శాప్ కోచ్ అనీల్‌కుమార్ అధికారులు కోచ్‌లు, క్రీడాకారులు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో అనంత చిన్నారి సత్తా


చీఫ్‌కోచ్ నాగేంద్రతో హంజాహుస్సేన్

అనంతపురం క్లాక్‌టవర్, మే 23(ఆంధ్రజ్యోతి): జాతీయ స్కేటింగ్ పోటీల్లో అనం తపురం నగరానికి చెంది న చిన్నారి హంజా హుస్సేన్‌కు పతకం దక్కింది. ఇటీవల కేరళలో జరిగిన ఎనిమిదో జాతీయ స్థాయి స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నగరానికి చెందిన స్కేటర్ హంజాహుస్సేన్ రజత పతకం సాధించాడు. ఏడేళ్ల వయస్సులోనే అనేక పతకాలు సాధిస్తున్న హంజా హుస్సేన్ తిరిగి తన సత్తా చాటాడు. తమ క్రీడాకారుడు పతకాలు సాధించడం పట్ల జిల్లా రోలర్ స్కేటింగ్ కార్యనిర్వాహక కార్యదర్శి రవిబాల, మాక్ రోలర్ స్కేటింగ్ చీఫ్ కోచ్ నాగేంద్ర, కోచ్‌లు అనిల్‌కుమార్, హేమంత్‌కుమార్‌ను అభినందించారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ


సభ్యత్వ కార్డుల పంపిణీలో నాయకులు

శెట్టూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లి గ్రామంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇందులో పార్టీ సభ్యత్వం తీసుకున్న నాయకులు, కార్యకర్తలకు కార్డులను అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. సభ్యత్వం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారెడ్డి, వన్నూరురెడ్డి, ఆనంద బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

విడపనకల్లు, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంచనహాలు గ్రామం వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందారు. ఎస్ఐ ఖాజా హుస్సేన్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బళ్లారి నుంచి గుంతకల్లుకు వెళ్తున్న లారీ అంచనహాలు గ్రామం వద్ద ముందు టైర్ పంక్చర్ కావటంతో డ్రైవర్ ఈరన్న (51) రోడ్డుకు ఎడమ వైపున నిలుపుకుని టైర్ మార్చుకునేందుకు దాని కిందకు దూరాడు. అదే రోడ్డుపై బళ్లారి నుంచి గుంతకల్లుకు వెళ్తున్న మరో లారీ ఆగి ఉన్న ఆ లారీని వెనుక వైపున వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో లారీ కింద ఉన్న డ్రైవర్ ఈరన్న అక్కడికక్కడే మృతి చెందాడు. అతను కర్ణాటక రాష్ట్రంలోని కంప్లి వాసిగా తెలిసిందని, సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని గుంతకల్లు ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ పేర్కొన్నారు.

జాతీయ సైన్స్‌డేలో కోణంపల్లి విద్యార్థుల ప్రతిభ

బెళుగుప్ప, మే 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మార్చి 15వ తేదీన నిర్వహించిన జాతీయ సైన్స్‌డేలో మండలంలోని కోణంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు జయపాల్, గురుప్రకాష్ ప్రతిభ కనబరచినట్లు హెచ్‌ఎం సుధామాధవి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. చిన్నవయసులో గర్భధారణ పర్యావసానాలు, వికసిత్ భారత్ యువత అనే అంశాలపై వారు ప్రతిభ చూపారన్నారు. ఇందుకు కలెక్టర్ వినోద్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు సైతం అందుకున్నట్లు హెచ్‌ఎం పేర్కొన్నారు.

ప్రతి రైతు ఏపీఎఫ్ఆర్ చేయించుకోవాలి

బెళుగుప్ప, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి రైతు ఏపీఎఫ్ఆర్‌ను ఈ నెలాఖరు లోగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి పృథ్వీసాగర్ శుక్రవారం ప్రకటనలో సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రాలకు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరుతో వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయిస్తేనే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ లాంటి ప్రభుత్వ రాయితీలకు అర్హులవుతారన్నారు. మండలవ్యాప్తంగా 6727 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఇంకా 3300 మంది మిగిలి ఉన్నారని అన్నారు.

పెయిడ్ ఇంటర్న్‌షిప్‌నకు గేట్స్ విద్యార్థుల ఎంపిక

గుత్తి, మే 23(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గేట్స్ పాలిటెక్నికల్ విద్యార్థులు పెయిడ్ ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికైనట్లు కళాశాల ఎండీ రఘునాథ్ రెడ్డి శుక్రవారం తెలిపారు. కళాశాలలో పాలిటెక్నిక్ చివరి సంవత్సరం చదువుతున్న 40 మంది విద్యార్థులు పెయిడ్ ఇంటర్‌షిప్‌నకు ఎంపికయ్యారన్నారు. వైద్య రంగంలో ప్రసిద్ధి చెందిన ఆశా మెడికల్ డివైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరులోని యూటో సంస్థలలో ఈ విద్యార్థులు ఇంటర్‌షిప్ చేయనున్నట్లు చెప్పారు. ఎంపికైనా విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

యోగా డే సర్వేను వందశాతం పూర్తిచేయాలి

గుత్తి, మే 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న యోగాడే సర్వేను వంద శాతం పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో ఉన్న మున్సిపాలిటీలోని ప్రజలకు యోగాడే సర్వేను చేయాలని ఆదేశించారు. సచివాలయ సెక్రెటరీలు, మెప్మా ఆర్పీల ద్వారా ఈ సర్వే నిర్వహించి జూన్ 21న జరిగే యోగా డేలో అందరూ పాల్గొనేలా చూడాలని సూచించారు. మేనేజర్ రాంబాబు, టౌన్‌ప్లానింగ్ అధికారి మారుతీప్రసాద్, మెప్మా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల్ని సత్వరమే పరిష్కరిస్తాం

పెద్దవడుగూరు, మే 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రెవెన్యూ, పోలీసుశాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక ఫిర్యాదుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి, తహసీల్దార్ ఉషారాణి పాల్గొన్నారు. మొత్తం 8మంది రైతులు భూ సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు చేశారని తెలిపారు. వాటిని త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎస్ఐ ఆంజనేయులు, రెవెన్యూ, పోలీసు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేతల అరెస్టు

తాడిపత్రి, మే 23(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని చుక్కలూరు రోడ్డు, నంద్యాలరోడ్డులో వేర్వేరుగా అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాయుడు తెలిపారు. పుట్లూరు మండలం చింతకుంట గ్రామానికి చెందిన రంగనాయకులు చుక్కలూరు రోడ్డులో మద్యం అమ్ముతుండగా సిబ్బందితో దాడులు చేసి అరెస్టు చేశామన్నారు. అలాగే అతడి వద్ద నుంచి మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా కొనగుంటపల్లి గ్రామానికి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి నంద్యాలరోడ్డులోని మిర్చి డాబా సమీపంలో మద్యం అమ్ముతుండగా అరెస్టు చేసి మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి, మే 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసపురంలో నాగరాజు (40) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని బెల్గాంకు చెందిన నాగరాజు ఉపాధి నిమిత్తం కుటుంబంతో తాడిపత్రికి వలసవచ్చి శ్రీనివాసపురంలో నివాసం ఉంటున్నారు. ఇక్కడ బేల్దారిపనులు, క్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా కొంతకాలంగా మద్యానికి బానిసైన ఇతను భార్యతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం కూడా భార్య భర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మనస్తాపం చెందిన నాగరాజు ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య సౌభాగ్యలక్ష్మితో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేస్తామని పోలీసులు తెలిపారు.

నేలకూలిన గాలిమర


కిందపడిన గాలిమర

పుట్లూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ. కొండాపురం గ్రామశివారులో ఓ గాలిమర శుక్రవారం సాయంత్రం ఉన్నట్లుండి నేలకూలింది. భారత్‌హెవీ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ కంపెనీకి చెందిన గాలిమరను 18 ఏళ్ల క్రితం సుమారు రూ.1.50కోట్ల వ్యయంతో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కొన్ని కారణాల వల్ల ఆ కంపెనీకి చెందిన గాలిమరలు తిరగడం లేదు. దీంతో అక్కడ సిబ్బంది కూడా ఎవరు లేకపోవడంతో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఫ్యాన్ల కిందభాగాన ఉన్న సామగ్రిని ఎత్తుకెళుతున్నట్లు సమాచారం. దీంతో కింద బెడ్‌భాగం దెబ్బతినడంతోనే గాలిమరలు కిందపడుతున్నాయా అన్న అనుమానాలు వస్తున్నాయి. రెండు నెలల వ్యవధిలోనే రెండు గాలిమరలు కిందపడ్డాయి. శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులు కూడా లేవు. అయినా గాలిమర కూలిపోవడంతో అనుమానాలుకు తావిస్తోంది. ఇంత జరుగుతున్నా ఆ కంపెనీ ప్రతినిధులు అక్కడకు రావడం లేదు.

ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యమందించాలి

● కలెక్టర్ వినోద్‌కుమార్


ఆస్పత్రిలో రోగితో వైద్య సేవలపై ఆరాతీస్తున్న కలెక్టర్

పామిడి, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ వినోద్ కుమార్ వైద్యులకు సూచించారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని వార్డులను పరిశీలించారు. పలు వార్డులలో అడ్మిట్ అయిన రోగులతో వైద్య సేవలపై ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుతం 30 పడకలుగా ఉన్న ఆస్పత్రిని 50 పడకలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీంతో మరింత మంది వైద్యులను కేటాయిస్తామన్నారు. ప్రభుత్వాసుపత్రిలో కాన్పులు శాతాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రోగులు కూడా తమ వివరాలను ఎన్టీఆర్ వైద్యసేవలో నమోదు చేసుకోవాలన్నారు. సీహెచ్‌సీలలో అవసరమైన ఆపరేషన్లను విజయవంతం చేస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఫార్మసీ విభాగంలో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆసుపత్రి ఆవరణాన్ని తరచూ పర్యవేక్షించాలని, బయోవేస్ట్‌ని కాల్చరాదని వైద్యాధికారి డాక్టర్ శివకార్తీక్ రెడ్డికి సూచించారు. శానిటేషన్ సిబ్బందికి శుభ్రం చేసేందుకు అవసరమైన మెటీరియల్ ఇవ్వాలన్నారు. ఆస్పత్రిలో లోపదోషాలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, తహసీల్దార్ శ్రీధరమూర్తి, వైద్యుడు మహేష్, హెడ్ నర్స్ శివకుమారి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తరగతి గదులు నిర్మించాలని వినతి

పామిడి: మండలంలోని దిబ్బసానిపల్లి గ్రామం ఎంపీయూపీ స్కూల్లో తరగతి గదులు నిర్మించాలని ఎంపీటీసీ సభ్యుడు మజ్జిగ రాజశేఖర్ కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కోరారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన కలెక్టర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దిబ్బసానిపల్లి గ్రామంలోని పాఠశాలలో తరగతి గదుల కొరత తీవ్రంగా ఉందని, దీంతో ఆర్డీటీ పాఠశాలలో పిల్లలకు చదువు చెప్పాల్సి వస్తోందని అన్నారు. కనుక పాఠశాలలో అదనపు గదులు నిర్మించాలని కోరారు. ఇంకా పలు సమస్యలపైనా ఆయన కలెక్టర్‌కు విన్నవించారు.


తాడిపత్రిలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న ప్రజలు


స్టెప్పులు వేస్తున్న జేసీపీఆర్, పేరం


బ్రహ్మసముద్రంలో..

ఘనంగా తిరంగా ర్యాలీ

తాడిపత్రి, మే 23(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడాన్ని పురస్కరించుకుని పట్టణంలో తిరంగాయాత్ర ర్యాలీని శుక్రవారం పెద్ద ఎత్తున నిర్వహించారు. స్థానిక మహాత్మాగాంధీ సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అశోక్‌పిల్లర్ వరకు కొనసాగింది. ఇందులో ప్రజలు కులమతాలకు, పార్టీలకు అతీతంగా పాల్గొని జాతీయ జెండాను చేతపట్టి భారత్ మాతకు జై అంటూ నినాదాలు చేశారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా జరిగిన యుద్ధంలో పాకిస్థాన్‌కు భారత్ తగిన బుద్ధి చెప్పిందన్నారు. ఇందుకు వీరోచితంగా పోరాడిన మన దేశ త్రివిధ దళాలకు సెల్యూట్ చేశారు. ర్యాలీలో జేసీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పేరం నాగిరెడ్డి ఉత్సాహంగా, ఉల్లాసంగా స్టెప్పులు వేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, జగదీశ్వరరెడ్డి, బీజేపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, అంకాల్‌రెడ్డి, గంగాధర్‌యాదవ్, శింగరి లక్ష్మీనారాయణ, రంగనాథరెడ్డి, ఆంజనేయులు, తహసీల్దార్ రజాక్‌వలి, మాజీ సైనికులు, ముస్లిం పెద్దలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● బ్రహ్మసముద్రం: మండలకేంద్రంలో బీజేపీ నాయకులు తిరంగా యాత్ర ర్యాలీని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, తహసీల్దార్ సుమతి, ఎంపీడీఓ నందకిషోర్ తదితరులు హాజరై మాట్లాడారు. ఆపరేషన్ సింధూర్‌లో భారత సైనికులు చూపిన ధైర్యసాహసాలను కొనియాడుతూ ఈ ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. బస్టాండు నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. వైద్యాధికారి రాజేష్, బీజేపీ తాలుకా ఇన్‌చార్జి దేవరాజు, సీనియర్ నాయకులు చక్కా సుబ్రహ్మణ్యం, ఆంజనేయులు, ఆదినారాయణ, మండల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో సంపద తయారీ కేంద్రం పరిశీలన


పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఈడీ-1 ఉర్మైల్ దేవి

ఉరవకొండ, మే 23(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గుంతకల్లు రోడ్డులో ఉన్న చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్-1 ఉర్మైల్‌దేవి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ కేంద్రం వద్ద మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ ఎండీ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో అమలవుతున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను తనిఖీ చేస్తున్నామన్నారు. సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై అసహనం వ్యక్తం చేశారు. తడి, పొడి చెత్తను వేరు చేసి, వర్మీ కంపోస్టును తయారు చేసి విక్రయించి సంపదను సృష్టించాలని అక్కడి పారిశుధ్య కార్మికులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెత్త తో సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పారిశుధ్యం నిర్వహణకు వాహనాలను కొనుగోలు చేయాలని టీడీపీ నాయకుడు ప్యారం కేశవానంద వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్టేట్ ఎంఐఎస్ కన్సల్టెంట్ శివనారాయణ, పీఎంయూ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ సందీప్, ఎంపీడీఓ రవిప్రసాద్, కార్యదర్శి గౌస్, సర్పంచ్ లలితమ్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు

గుంతకల్లు, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలాంపల్లి గ్రామంలో స్థానిక టీడీపీ నాయకుడు ధనుంజయ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్టీఆర్‌పై అభిమానంతో ధనుంజయ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు గుమ్మనూరు శ్రీనివాసులు, ప్రతాప్ నాయుడు, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి


మృతదేహానికి పూలమాల వేస్తున్న దేవినేని ధర్మతేజ

కుందుర్పి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎర్ర చెన్నప్ప అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు టీడీపీ నాయకుడు దేవినేని ధర్మతేజ శుక్రవారం వచ్చి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల కన్వీనర్ ధనుంజయ, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, మాజీ సర్పంచ్ పెద్ద నరసింహప్ప, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యాత్మక రస్తా పరిశీలన

తాడిపత్రి, మే 23(ఆంధ్రజ్యోతి): గంగాదేవిపల్లి గ్రామంలో సమస్యాత్మక రస్తాను తహసీల్దార్ రజాక్‌వలి, రూరల్‌సీఐ శివగంగాధర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి దాదాపు వందల ఎకరాల భూములకు ఈ రస్తా ఉందని, కానీ ఇప్పుడు కొందరు రస్తా లేదంటూ ఎందుకు అడ్డగిస్తున్నారని ప్రశ్నించారు. అన్నదమ్ములుగా ఉన్న రైతుల మధ్య ఈ రస్తా సమస్య ఎందుకు వచ్చిందని ఇరువర్గాలను పిలిపించి చర్చించారు. పొలాలకు రస్తా లేకుండా ఎక్కడా ఉండదని, ఇలా అడ్డుకోవడం సబబు కాదని సూచించారు. ఏదిఏమైనా సమస్యను జఠిలం చేసుకున్నట్లయితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. తర్వాత ఇరువర్గాల అభిప్రాయాలను విన్న అధికారులు శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్దకు రావాలని సూచించారు.

రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు

ఉరవకొండ, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యాసాపురం రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్లు నిధులు మంజూరయ్యాయి. నిర్మాణానికి సంబంధించిన పనులకు పీఆర్ యూనిట్ అధికారులు శుక్రవారం కొలతలు కూడా తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సీతారాములు మాట్లాడుతూ ప్రధాన మంత్రి గ్రామీణ సడక్‌యోజన పథకం కింద 2.5కి.మీల మేర రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. ఇందుకు సహకరించిన మంత్రి కేశవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పీఆర్ యూనిట్ డీఈ మదన్‌మోహన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిరండి

పుట్లూరు, మే 23(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సీకేదిన్నె మండలం చెర్లోపల్లి గ్రామ శివారులో ఈనెల 27వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి టీడీపీ మహానాడు జరగనుందని పార్టీ మండల కన్వీనర్ బాలరంగయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

షాపుల వద్ద శుభ్రంగా ఉంచుకోండి: జేసీపీఆర్

తాడిపత్రి, మే 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీబీరోడ్డు, పోలీస్‌స్టేషన్ సర్కిల్ ప్రాంతాల్లో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి దుకాణాల యజమానులతో మాట్లాడుతూ షాపుల వద్ద పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వాహనాలు ఎక్కడబడితే అక్కడ పార్క్ చేయకూడదని సూచించారు. అనంతరం వ్యాపారాలు ఎలా జరుగుతున్నాయంటూ ఆరాతీశారు. ఆయన వెంట ఎస్వీ రవీంద్రారెడ్డి, కౌన్సిలర్లు ఉన్నారు.

గ్రామాల్లో తహసీల్దార్ పర్యటన

బొమ్మనహాళ్, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుదేవనహళ్లి, తార్కాపురం, బండూరు గ్రామాల్లో శుక్రవారం తహసీల్దార్ మునివేలు పర్యటించారు. ఈ సందర్భంగా బియ్యం పంపిణీపై ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయలను సేకరించారు. డీలర్లు బియ్యం పంపిణీలో సమయపాలన పాటించడంలేదని ప్రజలు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పౌర సేవలు, సంక్షేమ పథకాలపై లోపాలను సరిదిద్దేందుకు ఈ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. వీఆర్వో శృతి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

యాడికి, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జూన్ 1వ తేదీ నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నట్లు ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలపై మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నట్లు తెలిపారు. దుకాణాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిల్వలు ఉంటే మే 31వ తేదీ వరకు గడువు ఇస్తున్నట్లు చెప్పారు. ఆ తర్వాత వాటి విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ శశికళ, పంచాయతీ కార్యదర్శులు అశ్వర్థమనాయుడు, అరుణ్‌కుమార్, మహేశ్వర్‌రెడ్డి, రాజేశ్వరి, ప్రమీల పాల్గొన్నారు.

వైభవంగా పాండురంగడి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్నఅశేష భక్తజనం (ఇన్‌సెట్లో) పుష్పాలంకరణలో రుక్మిణీపాండురంగస్వామి మూలవిరాట్‌లు

బొమ్మనహాళ్, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంతకల్లులో రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వైశాఖ ఏకాదశి సందర్భంగా ప్రతి యేటా రథోత్సవంను నిర్వహిస్తున్నట్లు పాండురంగస్వామి ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయమే అర్చకులు స్థానిక ఆలయంలోని స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకం, విశేష పుష్పలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. తర్వాత సాయంత్రం ఉత్సవమూర్తులను రథంలో కొలువుదీర్చారు. పండరీపురి గోపాల్‌మహరాజ్‌గురూజీ రథానికి పూజలు నిర్వహించి ముందుకు కదిలించారు. వేలాది మంది భక్తులు జై విఠలా జైజై విఠలా అంటూ రథాన్ని లాగారు. పురవీధుల గుండా రథోత్సవం సాగింది. మహిళలు హారతులు పట్టారు. నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణా ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఎస్ఐ నబీరసూల్ బందోబస్తు నిర్వహించారు.

విఠోబాస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో విఠోబాస్వామి

పామిడి, మే 23 (ఆంధ్రజ్యోతి): ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని రంగసుబే ఫిర్కా భగవాన్ దాస్ విఠోబాస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, అలంకరణలు, విశేష పూజలు చేపట్టారు. అనంతరం రుక్మిణీ సమేతంగా విఠోబస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. రంగసుబే ఫిర్కా భావసార క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు టీటీ నాగభూషణం, కార్యదర్శి టీటీ శ్రీనివాసరావు, భజన మండలి అధ్యక్షుడు మురళి సుందర్ రావు, అర్చకులు సూర్యనారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణలు, పూజలు, తులసీ అర్చన తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం విష్ణుపారాయణం జరిపారు. పెద్దఎత్తున భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ

పెద్దవడుగూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులాంపల్లి గ్రామంలో శుక్రవారం రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఎస్ఐ ఆంజనేయులు పాల్గొని వాటిని ప్రారంభించారు. కడపజిల్లా ప్రొద్దుటూరుకు చెందిన వెంకటసాయిభవిత్‌రెడ్డి వృషభాలు మొదటి బహుమతిగా రూ.70 వేలు సాధించాయి. అదేజిల్లా మోరగుడి గ్రామానికి చెందిన మహేశ్వరరెడ్డి వృషభాలు రెండోబహుమతిగా రూ.50 వేలు, నంద్యాల జిల్లా చిన్నకానాల గ్రామానికి చెందిన చెన్నారెడ్డి వృషభాలు మూడో బహుమతిగా రూ.35 వేలు, యాడికి మండలం రాయలచెరువుకు చెందిన జయచంద్రారెడ్డి వృషభాలు నాలుగో బహుమతిగా రూ.30 వేలు, అదేజిల్లా ముక్కామల గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి వృషభాలు ఐదో బహుమతిగా రూ.25 వేలు సాధించాయి. వాటి యజమానులకు నిర్వాహకుడు నారాయణరెడ్డి, గ్రామపెద్దలు నగదు బహుమతులను అందజేశారు.

పండ్లమొక్కల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

కణేకల్లు, మే 23(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా సన్న, చిన్నకారు రైతులు పండ్ల మొక్కల పెంపకానికి ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని ఉపాధిహామీ ఏపీఓ సుధాకర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఐదెకరాలలోపు భూములున్న రైతులు ఆయా గ్రామాలలో ఉన్న ఉపాధి హామీ సిబ్బందితో కలిసి వివిధ రకాల పండ్లమొక్కల పెంపకానికి దరఖాస్తులు సమర్పించుకోవాలని సూచించారు.

పొగాకు అనర్థాలపై అవగాహన

కుందుర్పి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనుములదొడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్యాధికారి సుమన్ ఆధ్వర్యంలో పొగాకు వాడకం వలన కలిగే నష్టాల పట్ల అవగాహన సదస్సు జరిగింది. ఇందులో జిల్లా పొగాకు నియంత్రణ సామాజిక కార్యకర్త శ్రీరాములు పాల్గొని మాట్లాడారు. పొగాకు ఉత్పత్తులైన బీడీ, సిగరెట్, గుట్కా, ఖైనీ లాంటి వాటిని అలవాటు చేసుకుంటే ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. అనంతరం పొగాకుకు వ్యతిరేకంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ ధర్మసింగ్, ఆశా కార్యకర్తలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై కళాజాతా

విడపనకల్లు, మే 23(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు గాను మండల కేంద్రంలోని బస్టాండ్‌లో శుక్రవారం కళాజాతను నిర్వహించారు. ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం ఆధ్వర్యంలో జంగం శ్రీనివాసుల కళా బృందం వారు ఈ కళాజాతను నిర్వహించారు. ఇందులో ఎయిడ్స్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో వైద్యురాలు పుష్ప, ఆస్పత్రి సిబ్బంది, కళాకారులు, ఆశ వర్కర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి

ఉరవకొండ, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి సమీపంలో గల గొర్రెల మందపై శుక్రవారం కుక్కలు దాడి చేశాయి. దీంతో 15 గొర్రె పిల్లలు మృతి చెందాయి. అదే గ్రామానికి చెందిన గురుస్వామి స్థానిక మారెమ్మ ఆలయం సమీపంలో గొర్రెల మందను వదిలాడు. ఆ మందపై కుక్కలు దాడి చేసి గొర్రెపిల్లలను చంపేశాయి. రూ. లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

మహిళల ఆచూకీ లభ్యం

కళ్యాణదుర్గం, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పార్వతీనగర్‌లో ఉన్న ఉజ్వల హోమ్ నుంచి అదృశ్యమైన ఇద్దరు మహిళల ఆచూకీని 24 గంటల్లోనే పోలీసులు కనుగొన్నారు. గత గురువారం అర్ధరాత్రి ఉజ్వల హోమ్ నుంచి ఇద్దరు మహిళలు తప్పించుకెళ్లారు. దీంతో ఉజ్వలహోమ్ నిర్వాహకులు శుక్రవారం ఉదయం పట్టణ సీఐ యువరాజు కు ఫిర్యాదు చేశారు. ఆయన ప్రత్యేక బృందంతో పలు చోట్ల విచారించడంతో పాటు, సమీప పోలీస్‌స్టేషన్లకు ఆ మహిళల వివరాలను పంపించి ఆచూకీ కనిపెట్టాలని సూచించారు. దీంతో ఎట్టకేలకు ఉరవకొండ పోలీసులు ఆ ఇద్దరు మహిళల ఆచూకీ కనుగొన్నారు. ఫిర్యాదు చేసిన 24 గంటల్లోపే మహిళల ఆచూకీని కనుగొన్నందుకు టౌన్ సీఐను ఉన్నతాధికారులు అభినందించారు. అనంతరం ఆ మహిళలను ఉజ్వలహోమ్‌కు అప్పగించారు.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కళ్యాణదుర్గం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరేపలి గ్రామంలో బలరాముడు అనే వ్యక్తిపై శుక్రవారం తెల్లవారుజామున ఎలుగుబంటి దాడి చేసింది. దీంతో అతను తీవ్ర గాయాలపాలయ్యాడు. బలరాముడు బహిర్భూమి కోసం సమీప పొలాల్లోకి వెళ్లాడు. అక్కడ పొదల చాటున దాగి ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా అతడిపై దాడి చేసింది. గమనించిన చుట్టుపక్కల వాళ్లు గట్టిగా కేకలు వేయడంతో పారిపోయింది. ఈ దాడిలో బలరాముడికి శరీరమంతా రక్త గాయాలయ్యాయి. వెంటనే 108లో కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అటవీశాఖాధికారులు బాధితుడిని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకుడు ధర్మతేజ కూడా పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కమిటీ ఎన్నిక

రాయదుర్గం, మే 23(ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ స్థాయి కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని భంభంస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ పాల్గొని కమిటీని ఎన్నిక చేశారు. అధ్యక్షుడిగా గలగల శ్రీను, ప్రధాన కార్యదర్శిగా కలుగోడు భీమరాజు, ఉపాధ్యక్షులుగా కలుగోడు హనుమంతు, గ్రామదట్ల కోటి, అధికార ప్రతినిధిగా వడ్రవన్నూరు ధనుంజయ, వర్కింగ్ అధ్యక్షులుగా తమ్మేపల్లి మల్లేష్, కార్యదర్శిగా జక్కలవడికి మహేష్‌లు ఎన్నికయ్యారు.